Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi


సంపుటి :04 సంచిక : 172 పేజీలు 8 వెల : 5 ఆదివారం 25 జనవరి 2026






## పిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలి

కశింకోట: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తేగాడ మోడల్ స్కూల్‌లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో హోంమంత్రి అనిత పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడా మైదానం కావాలని విద్యార్థులు కోరగా.. ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులతో కలిసి హోంమంత్రి కేక్‌కట్ చేశారు. చిన్న పొరపాట్ల వల్ల విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. పిల్లలకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేశ్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు.



# స్వచ్ఛాంధ్ర మన జీవన విధానం కావాలి

**మార్చిలోపు కోటి 12 లక్షల టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తాం. చెత్త నుంచి కరెంట్ తయారు చేసే ప్రాజెక్టులు విశాఖ, గుంటూరులో వచ్చాయి. కర్నూలు, రాజమహేంద్రవరం, కడప, నెల్లూరులో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. వారానికి ఒకసారి స్వచ్ఛ రథాలు వచ్చేలా చేస్తున్నాం. చెత్త తీసుకుని తిరిగి నిత్యావసర వస్తులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం.**

నగరి: ఏడాది క్రితం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా ప్రారంభించినట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. చిత్తూరు జిల్లా నగరిలో ఆయన పర్యటించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని.. మన జీవన విధానం కావాలని పిలుపునిచ్చారు. "మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి. మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలి. చెడు ఆలోచనలతో నేరస్థులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో చూశాం. స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్యత్తు ఉంటుంది . మార్చిలోపు కోటి 12 లక్షల టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తాం. చెత్త నుంచి కరెంట్? తయారు చేసే ప్రాజెక్టులు విశాఖ, గుంటూరులో వచ్చాయి. కర్నూలు, రాజమహేంద్రవరం, కడప, నెల్లూరులో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. వారానికి ఒకసారి స్వచ్ఛ రథాలు వచ్చేలా చేస్తున్నాం. చెత్త తీసుకుని తిరిగి నిత్యావసర వస్తులు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 2018లోనే రాష్ట్రాన్ని ఓడిఎఫ్‌గా తయారు చేశాం. ఇప్పుడు ఓడిఎఫ్? ప్లస్? దిశగా వెళ్తున్నాం" అని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లూ దోపిడీనే..గత ఐదేళ్లలో శాండ్, మైన్, వైన్.. అన్నింట్లోనూ దోపిడీనే సాగిందని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. ఆఖరికి శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదంలో నెయ్యి కూడా కల్తీనేనని అన్నారు. తానేదో క్రెడిట్ చోరీ చేస్తున్నానని జగన్ విమర్శిస్తున్నారని, పద్ధతిలేని రాజకీయాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. బ్లాక్?మెయిల్ రాజకీయాలు చేసిన వారు కూడా నీతులు మాట్లాడతారా? అని ప్రశ్నించారు.

## భూముల సర్వేపై విమర్శించి చేస్తున్నదేమిటి?



**కూటమి సర్కార్‌పై రోజా మండిపాటు**

నగరి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత ఆర్‌కే రోజా మరోసారి ధ్వజమెత్తారు. భూముల రీసర్వే అంశానికి సంబంధించి ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నదేమిటో అంటూ నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన సర్వేనే ఇప్పుడు మీరు చేయడం లేదా అని ప్రశ్నించారు. ఆనాడు తమపై విషం చిమ్మి.. ఇప్పుడు మీరు అదే చేస్తున్నారు కదా చంద్రబాబు అంటూ ఎద్దేవా చేశారు. శనివారం నగరి వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మాట్లాడిన ఆర్‌కే రోజా.. చంద్రబాబు పాలనంతా ఎగనామాలు, కోతలే అంటూ విమర్శించారు.'పాస్‌బుక్‌లపై మీ ఫోటోలు ఎందుకు వేసుకుంటున్నారు. మీ పాలనంతా ఎగనామాలు.. కోతలుగానే ఉంది.





# దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా

**61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవుతున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.




2వ

వనదేవతలకు మొక్కుల్లో భాగంగా భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా ఎత్తు బంగారం(బెల్లం) నెత్తిన మొస్తూ కాలినడకన దేవస్థానంలోని తల్లుల గద్దెలకు చేరుకున్నారు.

# మేడారం జాతరకు తరలుతున్న జనం

# తెలంగాణ జాగృతి సింహ గర్జన

**స్థానిక ఎన్నికల బరిలో దిగేలా మాస్టర్ ప్లాన్**

**ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తు పై పోటీ**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పటికే రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ పక్రియలో వేగం పెంచారు. అయితే, పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తి కావడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని అంచనా.



2వ

## టెండర్లు రద్దు చేయడమంటే.. అవినీతి జరిగినట్లే



హైదరాబాద్: బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు.నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమంతానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు?

నిన్న బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు. సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు. భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధమని హరీష్‌రావు స్పష్టం చేశారు.

## తెలంగాణ జాగృతి సింహ గర్జన



హైదరాబాద్: రాజకీయంగా బలపడడానికి అసవరమైన రీతిలో జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇందుకు అవసరమైన విధంగా పునాదులు వేయాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఎన్నికల్లో నిలబడాలన్న దిశగా వ్యూహం వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి నేతలు స్థానిక సంస్థల ఎన్నికల బరిలోకి దిగనున్నారు. మున్సిపాలిటీలతోపాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లోనూ సింహం గుర్తుతో పోటీ చేయాలని తెలంగాణ జాగృతి నాయకత్వం నిర్ణయించింది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సంప్రదింపులు పూర్తి చేసిన తెలంగాణ జాగృతి నాయకత్వం.. ఆ పార్టీకి చెందిన సింహం గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగాలని నిర్ణయించింది. ఇటీవల జరిగిన చర్చల్లో ఈ అంశంపై ఏఐఎఫ్‌బీ పార్టీ, తెలంగాణ జాగృతి మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పటికే రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ పక్రియలో వేగం పెంచారు. అయితే, పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తి కావడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని అంచనా. ఈలోపు రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలతోపాటు జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లోనూ ఏఐఎఫ్‌బీ సింహం గుర్తుతో బరిలోకి దిగాలని జాగృతి నాయకత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ జాగృతి నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆమె వల్ల ప్రధానంగా నష్టపోయేది బిఆర్ఎస్ పార్టీయే. ఇది కాంగ్రెస్‌కు లాభించగలదు. అలాగే బిజెపికి కొంత దెబ్బతినగలదని అంటున్నారు.

## మేడారం జాతరకు తరలుతున్న జనం




ములుగు: మేడారం జాతరలో సందడి నెలకొంది. భారీగా ప్రజలు తరలి వస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా రూ. 50 కోట్ల నిధులతో స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. మహా జాతరకు మరోమూడు రోజుల వ్యవధే ఉంది. ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున మేడారం తరలివస్తు న్నారు. మహా జాతరను తలపించేలా ప్రధాన కూడళ్లు, గద్దెలు, జంపన్నవాగు స్నాన ఘట్టాలు, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, విడిది చేస్తే అటవీ ప్రాంతాల్లో భక్తజనంతో రద్దీగా మారాయి. 3 లక్షల మందికి పైగా భక్తులు ప్రైవేటు, ఆర్టీసీ వాహనాల్లో తరలివచ్చారు. దీంతో రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తులతో మేడారం పరిసరాలన్నీ జనసంద్రంగా మారాయి. వనదేవతలకు మొక్కుల్లో భాగంగా భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా ఎత్తు బంగారం(బెల్లం) నెత్తిన మొస్తూ కాలినడకన దేవస్థానంలోని తల్లుల గద్దెలకు చేరుకున్నారు. ఆదివాసీల ఆచార సంప్రదాయాలలో చీరె, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, బెల్లం, ఒడిబియ్యం, యాట మొక్కులను చెల్లించుకుని తల్లీ సల్లంగా చూడు.. మహా జాతరకు వస్తాం అని వేడుకున్నారు.

# సింగరేణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాంగరెస్, బిఆర్ఎస్ ఇద్దరూ దోపిడీ దారులే
ఉమమడి ఎపిని మించి సింగరేణి గనుల దోపిడీ
మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్,జనవరి24 (ఆర్ఎన్ఎ): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా బాగోతం మీరు బయటపెడితే.. మీ బాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తర్వాత సింగరేణి బాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుంది' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతున్నారు. విచారణకు పిలిచామని సీపీ సజ్జనార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్, కేసీఆర్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇస్తోందా? కేటీఆర్, హరీశ్‌రావులతో సహా అందరినీ సాక్షిగా పిలిస్తే.. అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరు? ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటి? సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లే. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛనివ్వాలి. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుంది. ప్రజలను దోచుకున్న కేసులన్నీ కేసీఆర్ కుటుంబానికి లొట్టపీసు కేసుల్లాగే కనిపిస్తాయి. ఎన్ని అరాచకాలు, అవినీతి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే ధీమా కేసీఆర్ కుటుంబంలో ఉందని విమర్శించారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను విచారణకు పిలిచి నా ఫోన్ ట్యాప్ అయ్యిందని, మావోయిస్టు జాబితాలో నా పేరును చేర్చారని చెప్పారు. మరి అందుకు కారకులైన వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?. కాంగ్రెస్ స్కాంలు బయటపడుతున్నప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్ కేసుతో డ్రామాలాడుతున్నారు. కేటీఆర్ పెద్ద నిజాయతీపరుడిలా మాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజామ్ అరాచకాలను మరువలేదు.. నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్.. నా ఛాలెంజ్‌కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు. పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే.. మధ్యలోనే పారిపోతారు' అని కేంద్ర మంత్రి ఎద్దేవా చేశారు. 'రోహింగ్యాలు 2014కు ముందే పాతబస్తీలోకి అక్రమంగా ప్రవేశించారు. వారికి రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులే. బీఆర్ఎస్ పాలనలో నాటి హోంమంత్రి.. వారికి ఇళ్లు మంజూరు చేసి మద్దతిచ్చారు. రాష్ట్ర పాలకులే ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలకు వంతపాడుతుంటే.. శాంతిభద్రతలను కాపాడేదెవరని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.

# సింగరేణిపై దుష్ప్రచారం...కట్టుకథలు



హైదరాబాద్: సింగరేణి పై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి' అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్న స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేదని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని అన్నారు. సీఎం రేవంత్ రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదని, బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మంత్రి వివరించారు. తెలంగాణ కు ఆత్మ సింగరేణి అని అన్నారు. అలాంటి సింగరేణిపై కట్టుకథలు.. కొన్ని లేఖలు.. కొన్ని రివ్యూ లు వచ్చాయని మండిపడ్డారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగుల.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 20 వేల మంది నీ మానసికంగా దెబ్బతీసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పెట్టుబడులు రాకుండా.. కట్టుకథల విషపు రాతలు.. తొలిపలుకు రాతలు.. తప్పుడు ప్రచారం.. రాష్ట్ర ప్రభుత్వం పై కావాలని కథనాలు రాస్తున్నారు. రోజుకో కథ వండి వారిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సింగరేణికి సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సినటువంటి వ్యక్తిగా వీటన్నింటిని చూస్తూ ఉంటే ఏ రాబందులు ఏ గద్దలు ఏ దోపిడి దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలన్నీ వస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. ఇటువంటి రాతలతో తెలంగాణకు సంబంధించినటువంటి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ పైన నిందలు మోపే క్రమంలో ఈ రాష్ట్రానికి సింగరేణికి నష్టం చేస్తున్నారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. సింగరేణి నిర్ణయం మంత్రుల దగ్గరికి రాదు.. అటానమస్ సంస్థ ఇది. మంత్రి మండలి దగ్గరకు కూడా రాదు.. ఇంగితం ఉన్న.. విజ్ఞానం ఉన్న వారు ఇలా రాయరు అని తెలిపారు. పారదర్శకంగా ఉండాలి అనుకోవడమే కాదు.. పారదర్శకంగా ఉండాలి అని వెంటనే టెండర్ రద్దు చేయాలి అని చెప్పానని అన్నారు. హరీష్ లేఖ రాయడం.. కిషన్ రెడ్డి విచారణ చేపట్టడం.. మంచిది అయ్యిందన్నారు. కిషన్ రెడ్డి చర్యలను స్వాగతిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం.. అడ్డగోలుగా ప్రచారం చేసే వాళ్ల బతుకు బయట పడాలని అనుకున్నానని అన్నారు.గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచింది.. నిజం ఇలా ఉంటే.. భట్టి విక్రమార్క చేసినట్టుగా కథనాన్ని వండి వార్చారని మండిపడ్డారు.

# ఆపరేషన్ సిందూర్‌పై రాజీ లేదు

న్యూఢిల్లీ: పార్లమెంటులో పార్టీ నియమావళిని తాను ఎప్పుడూ ఉల్లంఘించలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విషయంలోనే తనకు పార్టీతో అభిప్రాయభేదాలున్నట్టు చెప్పారు. అయితే ఈ విషయంలో తాను క్షమాపణ కోరనని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఎండగట్టేందుకు విదేశాలకు వెళ్లిన కేంద్ర ప్రతినిధి బృందంలో శశిథరూర్ ఉండటం సొంత పార్టీ నుంచి విమర్శలకు దారితీసింది. కేరళ లిటరేచర్ ఫెస్టివల్ సందర్భంగా మీడియా అడిగిన ఒక ప్రశ్నకు శశిథరూర్ స్పందిస్తూ, ఆపరేషన్ సిందూర్ అంశంలో తాను ఒక బలమైన నిర్ణయం తీసుకున్నానని, దానికి కట్టుబడి ఉన్నానని, దానిపై తాను క్షమాపణ కోరనని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు తాను రాసిన ఆర్టికల్‌ను థరూర్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఒక రచయితగా పహల్గాం గురించి తాను ఆర్టికల్ రాశానని, ఉగ్రదాడులకు తగిన సైనిక స్పందన ఉండాలని అందులో చెప్పానని, అభివృద్ధిపై దృష్టిసారించిన భారత్ దీర్ఘకాల ఘర్షణలకు వెళ్లకుండా ఉగ్రవాద శిబిరాలను టా÷–గ్గ్ం÷ట్ చేయాలని అందులో పేర్కొన్నానని చెప్పారు. తాను ఏదైతో అభిప్రాయపడ్డానో అదేవిధంగా పాక్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేయడం తనకు ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. పార్టీ అధినాయకత్వంతో థరూర్‌కు విభేదాలున్నాయని, రాహుల్ గాంధీ ఇటీవల కొచ్చి వెళ్లినప్పుడు ఆయనకు ప్రాధాన్యత ఇవ్వలేదని, రాష్ట్ర నాయకులు సైతం థరూర్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఇటీవల ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై థరూర్ సైతం అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికలపై ఆ రాష్ట్ర నాయకులతో ఏఐసీసీ అధిష్ఠానం శుక్రవారంనాడు సమావేశమైంది. దీనికి కూడా శశిథరూర్ గైర్హాజరయ్యారు. పార్టీకి థరూర్ అవసరం ఇంకెంతమాత్రం లేదంటూ సందీప్ దీక్షిత్ సహా పలువురు పార్టీ నేతలు దీనిపై వ్యాఖ్యానించారు. శశిథరూర్ గైర్హాజరు వెనుక పార్టీతో విభేదాలే కారణమని ఊహాగానాలు సైతం వెలువడ్డాయి.

# సొంత చెల్లెలే ఫోన్ ట్యాప్ బారిన పడ్డారు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న విమర్శలపై పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత హననం జరుగుతోందని కెటిఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు
ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కెటిఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ కుటుంబం అలీబాబా 420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్రవిమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ స్టువర్ట్ పురం దొంగల బ్యాచా మారిందన్నారు. ఆరనీకుమా ఈకార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దీపం ఆరిపో కుండా చూసుకోవాలని సెటైర్లువేశారు. ఫోన్ ట్యాపింగ్పై కెటిఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యా స్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలాతీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు. కాళేశ్వరం అవినీతి పై కెసిఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బిజెపి నేతలపై ఉన్న ఇడి కేసులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగు తుందని, అలాంటప్పుడు సినిమావాళ్లఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.


# సొంత చెల్లెలే ఫోన్ ట్యాప్ బారిన పడ్డారు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేస్తున్న విమర్శలపై పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. వ్యక్తిగత హననం జరుగుతోందని కెటిఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు
ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కెటిఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్ కుటుంబం అలీబాబా 420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్రవిమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ స్టువర్ట్ పురం దొంగల బ్యాచా మారిందన్నారు. ఆరనీకుమా ఈకార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ దీపం ఆరిపో కుండా చూసుకోవాలని సెటైర్లువేశారు. ఫోన్ ట్యాపింగ్పై కెటిఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యా స్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలాతీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు. కాళేశ్వరం అవినీతి పై కెసిఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ను తాను నేరుగా ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అలాగే బిజెపి నేతలపై ఉన్న ఇడి కేసులు ఎందుకు పెండింగ్లో ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ కీలక ప్రశ్న లేవనెత్తారు. దేశ భద్రతకు ముప్పుగా మారే శక్తులపై మాత్రమే ఫోన్ ట్యాపింగ్ జరుగు తుందని, అలాంటప్పుడు సినిమావాళ్లఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుగుతున్నాయన్న అనుమానంతో తన ఫోన్ను కూడా ట్యాప్ చేశారని తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో తగాదాలకు అసలు కారణం వాటాల పంపకంలో తేడాలేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ పాలనలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని తెలిపారు.


## అందరి బాగోతాలను బయటపెడతాం

**హైదరాబాద్:** ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టినవారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు.

ఉత్తేజిత దినపత్రిక


# కోడుమూరు నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

కోడుమూరు జనవరి 24 శనివారం నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం కోడుమూరులో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జి శ్రీ ఆదిమూలపు సతీష్ మరియు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ ఎస్వీ మోహన్ రెడ్డి , కర్నూల్ పార్లమెంట్ సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై పోరాటం చేయడం, రాబోయే రాజకీయ పరిణామాలకు సిద్ధమవడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా కర్నూల్ పార్లమెంట్ సమన్వయకర్త శ్రీమతి బుట్టా రేణుక గారు మాట్లాడుతూ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనేది ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన పార్టీ అని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి గారి ఆశయాలను కొనసాగిస్తూ, వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదలు, రైతులు, మహిళలు, యువతకు నేరుగా మేలు చేశాయని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సంక్షేమం వంటి



రంగాల్లో వైయస్ఆర్ ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని ఆమె గుర్తు చేశారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రజలకు అండగా నిలబడిన పార్టీ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ నిధులు జమ చేయడం ద్వారా అవినీతికి తావులేని పాలనను అందించామని శ్రీమతి బుట్టా రేణుక పేర్కొన్నారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ చేరాయని, ఇది దేశంలో ఎక్కడా లేని ప్రత్యేకమైన పాలన నమూనా అని అన్నారు. ప్రస్తుత అధికార ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలులో కోతలు, అభివృద్ధి పేరుతో ప్రజలపై భారాలు మోపడం వంటి నిర్ణయాలతో పేదల జీవితం కష్టతరమైందని విమర్శించారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ, ప్రజల తరఫున పోరాడాల్సిన బాధ్యత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందని ఆమె స్పష్టం చేశారు. కోడుమూరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలంగా నిలబెట్టేందుకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని శ్రీమతి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ముందుకు సాగితే రాబోయే రోజుల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కోడుమూరు నియోజకవర్గంలో పార్టీకి బలమైన క్యాడర్ ఉందని, కార్యకర్తల అంకితభావమే పార్టీ బలం అని అన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లడంలో నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధ్యక్షత వహించిన శ్రీ ఆదిమూలపు సతీష్ మరియు శ్రీ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని, ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత చురుగ్గా నడిపిస్తామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, జిల్లా కార్యదర్శులు, జిల్లా అనుబంధ విభాగ నాయకులు, నియోజకవర్గ అనుబంధ విభాగ నాయకులు, మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు, యువజన, మహిళా, రైతు విభాగాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమైనది

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**




: ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంతో పాటు కీలకమైనదని తాసిల్దార్ నాగమణి, అన్నారు. ఆదివారం జరిగే అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ మారుతి, ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆఫీస్ సిబ్బంది వీఆర్వోలు, వీఆర్ఏలతో ఓటర్ల దినోత్సవం పై ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హేమంత్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, హరీష్, ముని, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**బేతంచేర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, ఎంపీడీవో ఫజల్ రహిమాన్, పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ లో భాగంగా నగర పంచాయతీ సిబ్బంది పొదుపు మహిళలు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. వీధులలో చెత్త వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని ప్రజలకు సూచించారు. అనంతరం అంతర్ జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వైద్యురాలు తస్లీమా, ఐసిడిఎస్ సూపర్వైజర్ తిప్పమ్మ, లు మాట్లాడుతూ సమాజంలో బాలురులతో పాటు సమానంగా బాలికల విద్యను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వారు. కోరారు. ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని బాలికలు ఉన్నత లక్ష్యం వైపు పయనించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పొదుపు మహిళలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# కేసీ కాల్వకు 1625 క్యూసెక్కుల నీటి విడుదల..!








ముచ్చుమర్రి ,మల్యాల ఎత్తిపోతల నుండి నీటి విడుదల
నీటిని విడుదల చేసిన మాండ్ర శివానందరెడ్డి
ఎమ్మెల్యే జయసూర్యకు రైతుల ప్రత్యేక ధన్యవాదాలు
కూటమి ప్రభుత్వానికి కేసీ రైతుల ధన్యవాదాలు

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి జనవరి 24**

-: మల్యాల ఎత్తిపోతల పథకం నుండి రెండు పంపుల ద్వారా 675 క్యూసెక్కులు, ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ నుండి నాలుగు పంపుల ద్వారా 950 క్యూసెక్కుల నీరు కేసి కెనాల్ ఆయకట్టు రైతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,జిల్లా ఇంచార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుల ప్రత్యేక చొరవతో నీరు విడుదల చేయడం జరిగిందని నంద్యాల తెదేపా పార్లమెంట్ ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని మల్యాల ఎత్తిపోతల పథకం మరియు ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మొత్తం ఆరు పంపుల ద్వారా 1625 క్యూసెక్కుల నీటిని నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యలు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాతో చర్చించారని వారి ఆదేశానుసారం ప్రకారమే నీరు విడుదల చేశారు. గత డిసెంబర్ 2వ తేదీ నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, వివిధ ప్రాజెక్టుల నిర్వహణ పరిస్థితి, ఈ రబీ సాగుకు అవసరమైన నీటి లభ్యతపై సమగ్రంగా చర్చించి, ఈ జనవరి 15 తరువాత కే.సి. కెనాల్?కు నీరు అందుబాటులో ఉండదని స్పష్టమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. తుంగభద్ర డ్యాంలో గేట్లకు చేపట్టిన అత్యవసర మరమ్మత్తుల కారణంగా డ్యాం నుండి నీటి విడుదల పరిమితమై, అందుబాటులో ఉన్న నీటి పరిమాణం గణనీయంగా తగ్గిపోయిందనీ, సాంకేతిక పరిస్థితుల నేపథ్యంలోనే నీటి సరఫరా విషయంలో కొంత జాప్యం జరిగిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ లో కే.సి. కెనాల్ పరిధిలోని మొత్తం ఆయకట్టు ఒక పంటకు పూర్తి సాగు నీరు అందించడం జరిగిందని శివానందరెడ్డి అన్నారు. రబీ పంటను కాపాడుకునేందుకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, అవాస్తవ ప్రచారాలను రైతులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేసీ కెనాల్ కు నీళ్లు విడుదల కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ.కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి ,టిడిపి మండల కన్వీనర్ లు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి , పలుచాని మహేశ్వర రెడ్డి ,డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బన్నూరు పరమేశ్వర రెడ్డి , సొసైటీ చైర్మన్ లు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కబ్జా స్థలం విషయంపై తప్పుడు నివేదిక నివ్వటం రెవిన్యూ అధికారులకు తగదు..



కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి ఎమ్మిగనూరు జనవరి 24 సర్వే చేయకుండా సర్వే చేశామని పత్రికల్లో ఇవ్వటము తగదు..తక్షణమే డిస్టిక్ సర్వేరు మండల సర్వేయర్ తో చేనేతల స్థలాన్ని సర్వే చేయించాలి... పందికోన ఈరన్న సామాజిక వేత్త మరియు రాజకీయ విశ్లేషకులు తెలుగుదేశం పార్టీ 29 వ వార్డు ప్రధాన కార్యదర్శి. ఈ సందర్భంగా పందికోన ఈరన్న మిలిటరీ కాలనీ నివాసుడు మిలటరీ కాలనీ తెలుగుదేశం పార్టీ 29వ వార్డు ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... చేనేత కనికే నారాయణ మిలిటరీ కాలనీలో 1993 సంవత్సరంలో 6 సెంట్లు విస్తీర్ణంలో గల స్థలాన్ని సర్వే నంబర్ 574 లో కొనుగోలు చేయడం జరిగింది. అయితే ఈ స్థలాన్ని అవకాశంగా తీసుకుని కబ్జాదారులు చెక్ బందులు మరియు సర్వే నంబర్ 575 గా మార్చడం జరిగింది.. అయితే మొన్నటి రోజున సర్వేకు వచ్చామని చెప్పి చేనేతల స్థలం అక్కడ లేదని వేరే సర్వే నంబర్లు ఉందని విలేకరులకు పేపర్ ద్వారా రెవెన్యూ అధికారులు ఇవ్వడం జరిగింది.. అయితే నిజ నిజాలు పరిశీలించగా రెవిన్యూ అధికారులు ఎక్కడ కూడా మండల సర్వేయర్ తో కొలతలు వేయించలేదు. కేవలం తప్పుడు నివేదిక ఆధారంగానే పేపర్కి ఇచ్చారు..

అయితే చేనేత కనిక నారాయణకు న్యాయం జరగాలంటే 574 సంబంధించినటువంటి మిలిటరీ కాలనీలో ఉన్నటువంటి ఓల్డ్ గెజిట్ మరియు 575 సంబంధించినటువంటి ఓల్డ్ గెజిట్ మరియు పాత ఎఫ్ఎమ్బిలను దగ్గర ఉంచుకొని సర్వే చేయాలి. అంతేకానీ కొత్త మ్యాపులతో సర్వే చేస్తాం అంటే సరిపోదు.. సర్వే అధికారులు కనిక నారాయణ విషయంలో ఔకతవకలకు పాల్పడితే కచ్చితంగా రెవెన్యూ శాఖ మంత్రివర్యులు మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు , ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారికి ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రివర్యులు శ్రీమతి వంగలపూడి అనిత మేడమ్ గారు వీరందరి దృష్టిలో తీసుకెళ్లి తప్పుడు నివేదికనిచ్చినటువంటి అధికారులపై ఖచ్చితంగా చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తాము.. 574లో ఎన్నిసార్లు సవరణ చేశారు . 574 సంబంధించినటువంటి ఓల్డ్ గెజిట్ 575 కు సంబంధించినటువంటి ఓల్డ్ గెజిట్ పాత ఎఫ్ఎమ్బిలను ఆ సర్వే నంబర్ లో ఉన్నటువంటి బాధితుల వెంచర్ మ్యాపును అన్నిటిని దృష్టిలో ఉంచుకొని సర్వే చేసి రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలి.

## మండల పరిధిలోని బనవాసి గ్రామానికి చెందిన

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**

ఎమ్మిగనూరు జనవరి 24 శనివారం మండల యువజన విభాగ అధ్యక్షులు బనవాసి బసిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మిగనూరు నుండి హైదరాబాద్?కు వెళ్తుండగా, మార్గమధ్యంలో మహబూబ్?నగర్ జిల్లా మూసాపేట (వి) జానంపేట సమీపంలోని జాతీయ రహదారి--44 పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన భార్య రాధ (36), కుమార్తె లక్ష్మీదుర్గ (8) అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత విషాదకరం. బిఈ ప్రమాదంలో బనవాసి బసిరెడ్డి మరియు ఆయన కుమారుడికి స్వల్ప గాయాలు కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం వారు బనవాసి గ్రామంలోని తమ నివాసానికి చేరుకున్నారు. ఈ విషాద వార్త తెలుసుకున్న వెంటనే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక , పార్టీ సీనియర్ నాయకులు, బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివనీలకంఠ బనవాసి గ్రామానికి చేరుకొని బనవాసి బసిరెడ్డి గారిని, ఆయన కుమారుడిని మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు







మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి విషాద ఘటనను కుటుంబం ధైర్యంగా ఎదుర్కొని, ఈ కఠిన సమయంలో దేవుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.ఆర్. రామకోటేశ్వర్ రెడ్డి , ఎమ్మిగనూరు పట్టణ మునిసిపల్ వైస్ చైర్మన్, ఎమ్మిగనూరు నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు డి. నజీర్ అహమ్మద్ , జిల్లా చేనేత అధ్యక్షులు యం.కె. శివ ప్రసాద్ గారు, ఎమ్మిగనూరు పట్టణ 15వ వార్డు ఇంచార్జ్ సయ్యద్ ఫయాజ్ , ఎమ్మిగనూరు నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు ఎన్.యండి. షరీఫ్ జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి కదిరికోట రాజ్ కుమార్ , వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిజినవేములలో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే...!


**- వ్యర్థ పదార్థాలను ఇవ్వండి....నిత్యావసర సరుకులు పొందండి..**

**నందికొట్కూరు ఉత్తేజిత ప్రతినిధి**



జనవరి 24 -: ఇంట్లోని వ్యర్థ పదార్థాలను తీసుకుని వాటికి బదులుగా నిత్యావసర సరుకులు స్వచ్ఛ రథాల ఆపరేటర్ల ద్వారా అందించే విధంగా కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో గ్రామ ప్రథమ పౌరుడు రవి యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య గ్రామాలలోని వ్యర్థ పదార్థాల సేకరణకై స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే కు గ్రామ సర్పంచ్ .. ఎంపీడీవో తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పుష్పగుచ్చం అందజేసి స్వాతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ఇళ్లల్లో పనికిరాని వ్యర్థ పదార్థాలు ఏమైనా ఉంటే వాటిని తీసుకొని( అట్టలు, ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాలు తదితర పొడి వ్యర్థాలు ) అందుకు తగ్గట్టుగా నిర్ణయించిన ధరకు విలువ చేసే నిత్యవసర సరుకులను స్వచ్ఛ రథాల ఆపరేటర్ల సిబ్బంది అందజేస్తారు అన్నారు. స్వచ్ఛ రథం మండల పరిధిలో వివిధ గ్రామాలకు వెళ్లాలన్న ఎంపీడీవో పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. అంతేకాక కందిపప్పు, గోధుమపిండి, మినపప్పు ,కొబ్బరి నూనె, సర్ఫు, కంఫర్ట్ ప్యాకెట్లు ,టూత్ పేస్టులు , టూత్ బ్రష్ ,షాంపూలు , బ్రూ ప్యాకెట్లు, టీ పొడి, లేస్ ప్యాకెట్ ,ఉల్లిపాయలు, బాత్ సబ్బులు, పెన్నులు ,పెన్సిళ్లు ,వేరుశన విత్తనాలు తదితర సరుకులు అందజేస్తారని ఆయన తెలిపారు. కావాల్సిన సరుకులు లేకుంటే నగదు కూడా ఇచ్చే అవకాశం ఉందన్నారు. స్వచ్ఛ రథం ద్వారా 8 రకాల పనికిరాని వస్తువులు కిలోల ప్రకారం కొనుగోలు చేస్తారని తెలిపారు. ఇనుము రూ.20, పేపర్లు రూ.15, పుస్తకాల రూ.10, అట్ట పెట్టలు రూ.10, ప్లాస్టిక్ సీసాలు రూ. 20, గాజు సీసాలు రూ. 2, స్టీలు వస్తువులు రూ.40, అల్యూమినియం రూ.140 ల ప్రకారం ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ఫర్వీన్, ఈ ఓ ఆర్ డి రంగనాయకులు, వ్యవసాయ అధికారి షేక్షావలి, ఐసిడిఎస్ సూపర్వైజర్ పావని, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణు మాధురి టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులూ.....తస్మాత్ జాగ్రత్త !



భారతీయ విద్యావిధానం మనిషి మేధావిని భాషించేలా..ప్రపంచాన్ని శాసించేలా ఉండేది. అన్నిరంగాల్లో విద్యార్థులను ఆరితేరేలా చేసే మన విద్యావిధానం పాతపడి పోయింది. ఎందుకంటే దానిని పాతరేశారు. బ్రిటిషర్ల హయాంలో మెకాలే విద్యావిధానంతో మన విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. అందుకే సమాజం లో నైపుణ్యత, నాణ్యత లేని విద్యను గడిస్తున్న విద్యార్థులు కోకొల్లలుగా పుట్టుకు వస్తున్నారు. వారికి నైపుణ్యాలు లేక ఎక్కడా రాణించడం లేదు. ఒళు వంచి పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో మనదేశంలో కోటళ్లల్లో నిరుద్యోగులు పెరిగి పోతున్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో అవకాశాలు దండిగా ఉన్నా..బిటెక్, ఎంటెక్‌లు చదివిన వారంతా ఇలాంటి పనులకు రాలేకపోతున్నారు. చదువు వేరు వృత్తి వేరు అన్న విధంగా ఆలోచించే ధోరణి కానరావడం లేదు. భారతీయుల మేధస్సు అమోఘం, అద్భుత మని ప్రపంచం ఎప్పుడో గుర్తించింది. ఇప్పటికీ విదేశాల్లో రాణిస్తున్నది కూడా మనవారే. ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్, సైన్స్ తదితర రంగాల్లో అద్భుత ప్రదర్శనను కనబరుస్తున్నాం. అయితే ఈ దిశగా మానవనరులను అభివృద్ధి చేసుకునేలా విద్యావిధానం రావడం లేదు. సమాజంలో విలువలు పడిపోవడానికి, యువతలో నైపుణ్యాలు లేకపోవడం కూడా విద్యావిధాన లోపంగానే గుర్తించాలి. అత్యాధునిక ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో నైపుణ్యత కొరవడింది. ప్రతిదానికి గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే గంటలతరబడి సెల్ ఫోన్లకు అతుక్కు పోతున్నారు. అలవాట్లో భాగంగా యువత పోర్న్ వీడియోలు తిలకి స్తున్నారు. జూదాలకు బానిసలు అవుతున్నారు. అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్నారు. నిజానికి ఇదో సామాజిక రుగ్మత. దీనిని మార్చాలంటే అక్షరాభ్యాసం నుంచే క్రమశిక్షణ అలవర్చాలి. విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. విలువలతో కూడిన విద్యను నేర్పాలి. లేకుంటే మరింతగా సమాజం దెబ్బతినగలదు. ఎందుకంటే ప్రస్తుతం పిల్లలంతా సెల్ ఫోన్లకు అలవాటు పడ్డారు. చిన్న పిల్లవాడిని బుజ్జగించడానికి, అన్నం పెట్టడానికి కూడా సెల్ ఫోన్ వాడేస్తున్నాం. దీంతో పిల్లల్లో మానసిక పరిపక్వత లోపించి, తరగతి గదిలో పరధ్యానంగా వుండిపోతున్నారు. ఆటస్థలంలోనూ నిశ్శబ్దంగా వుంటున్నారు. చురుకుగా, రాటుతేదలే కపోతున్నారు. పాఠాలు ఇప్పుడు చాలా చోట్ల స్క్రీన్ల మీద చెబుతు న్నారు. పిల్లలు వీటిని చూస్తూ టీచర్ల వైపు చూడ్డమే మానేశారు. వారితో సంభాషించడం లేదు. పరస్పర అవగాహన లోపిస్తోంది. దీంతో పిల్లలు టీచర్లు ఒకరికి ఒకరు దూరమైపోతున్నారు. తీరిక సమయాల్లో పిల్లలు వాళ్లలో వాళ్లు కూడా మాట్లాడు కోవడం మానేస్తున్నారు. ఇప్పటి పిల్లలది ఏదో ఒక కొత్త లోకమనిపిస్తోంది. మన కుర్రకారు యవ్వనమంతా అశాంతి, చిరాకు, ఆందోళన, ఒంటరి తనాలతో నిండిపోతోంది. తరగతి గది, బడి వాతావరణమంతా యాంత్రికంగా మారింది. పుస్తకాలూ చదవకుండా, గ్రంధపఠనం లేకుండా, పరిసరాల పై అవగాహన లకుండా, చుట్టూ ఏం జరుగుతుందో తెలియకుండా చదివేసి పట్టాలు పుచ్చుకుంటున్నారు. మన తినే అన్నం ఏ ధాన్యం ద్వారా వస్తుందో కూడా తెలియడం లేదు. పాలు ఎలా వస్తాయో తెలియడం లేదు. సెల్‌ఫోన్ పిచ్చిలో పడి మనిషికి మనిషికీ మధ్య అనుబంధాన్ని కోల్పోతున్నారు. నిజానికీ దేశంలోని పిల్లలందరికీ విజ్ఞానం దక్కాలి. వాళ్ల సామర్థ్యాలన్నీ వెలికి రావాలి. వారి మేధస్సుకు పదును పెట్టాలి. ఇవన్నీ కూడా పాఠశాలలో బోధనా తీరుతో..అదికూడా మన ప్రాచీన పద్దతుల ద్వారానే సాధ్యం అవుతుంది. దీనికి ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యత. పాలకుల ఓటు బ్యాంక్ రాజకీయాలకు విద్యావ్యవస్థ బలయిపోతోంది. చిన్ననాటి నుంచే కులాల కుంపట్లను రాజేస్తున్నాం. ఇక కులరహిత సమాజం ఎక్కడ పోతుందన్న ఆలోచన చేయడం లేదు. మనం మన పిల్లలకు కావలసిందంతా ఇస్తున్నామనుకుంటున్నాం. విస్తృత ప్రపంచాన్ని వారి ముందు తెరిచి పెడుతున్నామనుకుంటున్నాం.కానీ అది ఎలాంటి విపరిణామాలకు దారితీస్తున్నదో గ్రహిచడం లేదు. నగరాల్లో ఉన్న సెంట్రల్ సిలబస్, కేంబ్రిడ్జ్ వంటి స్కూళ్లతో పోల్చుకుంటే ఇప్పటికీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే కొంత జనరలం నాలెడ్జ్ అబ్బుతోంది. సెల్‌ఫోన్ కారణంగా మన పిల్లలు మానసిక రుగ్మతకు లోనవుతున్నారు. దీనికితోడు పిజ్జాలు, బర్గర్లు, చిప్స్, కూల్ డ్రింక్స్ లాంటి చెత్త తిండి వల్ల ఊబకాయం పెరిగి అనేక రకాల రోగాలు చేరుతున్నాయి. టీనేజర్లలో ఆత్మహత్యా ప్రయత్నాలు పెరిగాయి. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి ముగ్గురు బిడ్డల్లో ఒకరికి కంటి సమస్య తలెత్తు తోంది. ఒకరకంగా ఇదంతా మనం తెచ్చిపెట్టుకున్న సమస్య. ఎక్కువ కాలం ఫోన్లపై గడపడం, బ్లూ లైట్లు, నిద్ర లేమి, ఆటల కొరత ఇవన్నీ మనం కోరి తెచ్చుకొన్న ఉపద్రవాలు. కంటి జబ్బులతో ఇది ఆగడం లేదు. ఈ ఫోన్ల పుణ్యమా అని మన పిల్లలు డ్రగ్స్ బారిన పడుతున్నారు. హింసాత్మకంగా మారుతున్నారు. పోర్న్ వీడియోలకు బానిసలవుతున్నారు. వారి ప్రవర్తనలో తీవ్రమైన మార్పులొస్తున్నాయి. బస్సుల్లో, రైళ్లలో ప్రయాణించే మన చంటిపిల్లలు కూడా ఫోన్లకు అతుక్కుపోతున్నారు. కిటికీ లోంచి బయటికి చూడ్డం లేదు. అక్కడ వారికే కొత్త లోకమూ కనపడ్డం లేదు. విచిత్రంగా పసిబిడ్డలకు కూడా ప్రపంచం మూసుకుపోతోంది. ఇంతకంటే విషాదం మరోటి ఉండదు. కోవిడ్ రోజుల్లో మనం చెప్పిన ఆన్‌లైన్ పాఠాలు కూడా వారిని మరింతగా ఫోన్లకు బానిసల్ని చేశాయి. మనకు తెలియకుండానే మన పిల్లలు మానసికంగా బలహీనులై పోయారు. టెక్నాలజీ ఏదో గొప్పదనీ, దీన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకందించాలనీ మనమనుకుంటే అది పిల్లల్ని బడికి, కుటుంబానికి, చివరకు స్వతంత్ర ఆలోచనలకు కూడా దూరం చేసింది. ఇప్పుడు కోవిడ్ లేదు. అయినా సెల్ ఫోన్ల జాడ్యం మాత్రం కొనసాగుతోంది. దీనికి దూరం చేయడం కోసం పిల్లల్లో మానసిక పరివర్తనకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. సమతు ఆహారం ఇవ్వాలి. వ్యాయామం, నడకను ప్రోత్సహించాలి. ఇలా మనమంతా మన ప్రాచీన అలవాట్లను ముందుకు తెచ్చుకుంటే తప్ప మనుగడ సాగించడం కష్టం. తల్లిదండ్రులు ఈ బిజీ లైఫ్‌లో పిల్లల మనుగడ గురించి ఆలోచించడం లేదు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో వ్యాపారధోరణి పెరిగింది. అందుకే మనమే మారాలి.

## స్వర్ణ నంది అవార్డుకు డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు ఎంపిక..

**25 ఏళ్ల సేవలకు గుర్తింపు -- హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం.**

**నందికొట్కూరుఉత్తేజిత ప్రతినిధి జనవరి 24**



నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణానికి చెందిన డాక్టర్ దేశెట్టి శ్రీనివాసులు స్వర్ణ నంది అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాదులోని రుద్ర హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ పి. శ్రీనివాసరావు కళాకారులు, సమాజ సేవకుల ప్రతిభను గుర్తించి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు.

గత 25 సంవత్సరాలుగా సమాజ సేవలో నిరంతరంగా కృషి చేస్తూ, చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణ అందించి 350 మందికిపైగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధించేలా చేసినందుకు ఈ గౌరవం లభించింది. అలాగే 23 సార్లు రక్తదానం చేయడం, 15కి పైగా సినిమాల్లో నటించడం, టీవీ సీరియల్స్?లో పాత్రలు పోషించడం, రాజకీయ రంగంలో సేవలందించడం వంటి విశేష సేవలను కమిటీ గుర్తించింది.

ఈ స్వర్ణ నంది అవార్డును జనవరి 25న ఆదివారం హైదరాబాదులోని సత్యసాయి నిగమ్, అమీర్?పేట్?లో డాక్టర్ శ్రీనివాసులు స్వీకరించనున్నారు. గతంలో ఆయనకు 55కు పైగా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు లభించడం విశేషం.

## కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నందికోట్కూరులో జీరో గ్యాప్ శానిటేషన్ మెగా స్వచ్ఛత డ్రైవ్..




**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్. జనవరి 24..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల థీమ్ అయిన జీరో గ్యాప్ శానిటేషన్ -- వ్యక్తిగత పరిశుభ్రత, వ్యక్తిగత టాయిలెట్ల నిర్వహణ అంశంపై నందికొట్కూరు పురపాలకసంఘం ఆధ్వర్యంలో విస్తృత స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించినట్లు మునిసిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు మెగా క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించి, రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను క్లియర్ చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో వ్యక్తిగత పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, ప్రతి సంవత్సరం సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్, కమ్యూనిటీ టాయిలెట్ల వినియోగం, బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధంపై బ్యానర్లు, స్లోగన్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గౌరవ మునిసిపల్ కమిషనర్?తో పాటు మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వార్డ్ శానిటేషన్ సెక్రటరీలు తమ పరిధిలోని విద్యా సంస్థల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, కమ్యూనిటీ టాయిలెట్ల వినియోగం, బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధంపై బ్యానర్లు, స్లోగన్లతో అవగాహన కల్పించి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

## అమెరికాను కుదిపేస్తున్నమంచు తుఫాన్

**ఎమర్జెన్సీ ప్రకటించిన పలు రాష్ట్రాలు**

**4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు వెల్లడి**

వాషింగ్టన్: అమెరికాను భారీ మంచు తుపానుతాకింది. దీంతో పలు రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు, వర్షంతోపాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుపాను పంజా విసురుతోంది. మంచు తుపాను కారణంగా అమెరికాలోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నట్లు అధికారులు వెల్లడించారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఈ భీకర తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. శనివారం నాటి 3,200 విమాన సర్వీసులు, ఆదివారం నాటి 4,800 విమాన సర్వీసులు రద్దయినట్లు సైలట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. మున్ముందు ఈ పరిస్థితి మరింత తీవ్రతరమయ్యే అవకాశం ఉండడంతో పెద్దసంఖ్యలో రవాణా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని అంచనా వేసింది. వాతావరణ హెచ్చరికలతో అమెరికాలోని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సస్, ఆర్కాన్సాస్, జార్జియా, మిసిసిపి సహా పలు రాష్ట్రాలు ఎమర్జెన్సీ విధించాయి. మిసిసిపి, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రమాదకర చలి వాతావరణం ఉంటుందని.. మిస్సోరి, ఇల్లినోయీలలోనూ భారీ మంచు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ప్రతికూల వాతావరణం కారణంగా అనేక ప్రాంతాల్లో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడనుందని, వాహనదారులు మంచులోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇది ఈ దశాబ్దిలోనే అతి తీవ్రమైనదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## డోనాల్డ్ ట్రప్ నిర్ణయాలతో మార్కెట్లలో అనిశ్చితి

**బంగారం ధరలకు అదే కారణమంటున్న నిపుణులు**

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనాలైన బంగారం, వెండి వైపు మళ్లుతున్నారు. దీంతో, వీటికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతూ ధరలు చుక్కలనంటుతున్నాయి. అన్ని దేశాల్లో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. భారత్‌లో గురువారం తగ్గినట్టే తగ్గిన ధరలు శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. 10 గ్రాముల మేలిమి బంగారం రూ.2800 మేర, కిలో వెండి రూ.20 వేల మేర పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,720గా ఉంది. 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం రూ.1,46,410 వద్ద కొనసాగుతోంది. విజయవాడ, వైజాగ్‌లల్లో కూడా ధరలు దాదాపుగా ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ముంబైలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం అత్యల్పంగా రూ.1,54,320 వద్ద ట్రేడవుతోంది. నగరంలో వెండి ధరలు కూడా శుక్రవారం అమాంతం పెరిగాయి. ప్రస్తుతం కిలో వెండి రూ.3.60 లక్షలుగా ఉంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. ఔన్స్ 24 క్యారెట్ బంగారం స్పాట్ ధర 4,989 డాలర్లు చేరింది. ఔన్స్ వెండి ధర 103 డాలర్ల వద్ద తచ్చాడుతోంది. అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్‌పై ట్రంప్ మరోమారు విమర్శలు గుప్పించడంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో, ప్రభుత్వ బాండ్స్, కరెన్సీలను కాదనుకుంటున్న ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనాలైన బంగారం, వెండి వైపు మళ్లుతున్నారు. ఫలితంగా ధరలు ఊహించని రీతిలో పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇక పారిశ్రామికంగా ఉపయోగించే వెండి ధరల్లో పెరుగుదల బంగారాన్ని మించిపోతోంది. గత 12 నెలల్లో సిల్వర్ ధరలు 200 శాతం మేర పెరగ్గా బంగారం ధరలు 80 శాతం మేర పెరిగాయి.

## చైనాకు బలైపోతావ్ జాగ్రత్త !

**కెనడాను హెచ్చరించిన ట్రంప్**

వాషింగ్టన్: మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్న్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటును కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టు వారు చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం లోనే వారు చైనాకు ఆహారమైపోతారని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు. అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు. దీంతో, ట్రంప్ కూడా అంతేఘాటుగా స్పందించారు. ఇంతకాలం అమెరికా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గో÷-డలెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు. మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గో÷-డలెన్ డోమ్‌గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో హైదరాబాదీలు

**మయన్మార్-థాంఐ సరిహద్దుల్లో ముగ్గురు వ్యక్తులు**

**వ్యవహారాన్ని విదేశాంగ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అసద్**

హైదరాబాద్: విదేశాల్లో మంచి ఉద్యోగం ఇప్పిస్తామన్న సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి, హైదరాబాద్ కు చెందిన ముగ్గురు యువకులు థాయ్‌ల్యాండ్-మయన్మార్ సరిహద్దులో చిక్కుకుపోయారు. యువకుల్లో ఒకరు ఉస్మాన్‌నగర్‌కు చెందిన వారు కాగా మరో ఇద్దరు మౌలాలీ, బంజారాహిల్స్‌లకు చెందిన వారు. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని నమ్మించిన సైబర్ ముఠా.. వీరిని 15 రోజుల క్రితం థాయ్‌లాండ్‌కు రప్పించుకుంది. అక్కడకు వెళ్లిన తర్వాత ఉద్యోగం ఇవ్వకుండా, మయన్మార్ సరిహద్దుల్లోని నిర్బంధ శిబిరాల్లో ఉంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఇదే విషయాన్ని బాధితులు తమ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాధితుల్లో ఓ యువకుని తల్లి రెండు రోజుల క్రితం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి తన కుమారుడిని రక్షించాలని వేడుకుంది. దీనిపై స్పందించిన ఎంపీ.. విషయాన్ని విదేశాంగ మంత్రి జయశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌తో పాటు దక్షిణ భారత దేశం నుంచి మొత్తం 16 మంది ఇలాగే సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయి అక్కడే చిక్కుకున్నారని, వారందరినీ సురక్షితంగా భారత్‌కు రప్పించాలని కోరారు.

## అమెరికాలో దారుణ ఘటన

న్యూయార్క్: అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వ్యక్తులు హత్యకు గురయ్యారు. కుటుంబ తగాదాల వల్ల ఓ వ్యక్తి తన భార్యతో పాటు బంధువులను కాల్చి చంపాడు. జార్జియాలోని లారెన్స్‌విల్లే నగరంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి విజయ్ కుమార్ (51)ను పోలీసులు అరెస్టు చేశారు. మీడియా కథనాల ప్రకారం..

కాల్పుల విషయం పోలీసులకు ఫోన్‌కాల్ ద్వారా సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా.. అక్కడ నలుగురు భారత సంతతి వ్యక్తులు విగత జీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. కుటుంబ తగాదాల వల్లే విజయ్‌కుమార్ వారిని కాల్చి చంపాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. మృతులను కుమార్ భార్య మీను డోగ్రా (43), బంధువులు గౌరవ్ కుమార్ (33), నిధి చందర్ (33), హరీష్ చందర్(38)గా గుర్తించారు. కాల్పుల సమయంలో ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఆత్మరక్షణ కోసం వారు ఒక గదిలో దాక్కున్నారని పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు తమకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతోనే.. విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. పిల్లలను సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఇక, ఈ ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. నిందితుడు అరెస్టయ్యాడని.. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొంది.

## యధాతథంగా టిహమ్ కార్యాలయం

హైదరాబాద్: టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు.

టీ హబ్ ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.


## గణతంత్ర వేడుకల్లో తెలంగాణ ప్రత్యేకత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఏడాది జరిగే 77వ గణతంత్ర వేడుకల్లో ఈసారి తెలంగాణ బిడ్డలు ప్రత్యేకంగా నిలవబోతున్నారు. రాష్ట్రపతి, ప్రధాని, ఇతర దేశాధిపతుల ముందు తెలంగాణకే సొంతమైన కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు రిపబ్లికే డేలో పాల్గొన్నా, తొలిసారి ఒగ్గుడోలు విన్యాసానికి చోటు దక్కింది. ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందానికి ఆహ్వానం అందింది. దీంతో ఒగ్గు రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈనెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు. ఎముకలు కొరికే చలిలో దాదాపు 15 రోజులుగా కర్తవ్యపథ్ పై ప్రాక్టీస్ చేస్తున్నారు. సుమారు వంద మంది కళాకారులు దేశంలోని వివిధ కళారూపాలతో కలిపి, ఏక్ భారత్ అనే కాన్సెప్ట్ తో కళారూపాన్ని ప్రదర్శించనున్నారు. త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీస్ కంటింజెట్లకు ఏమాత్రం తీసిపోకుండా, కేవలం తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సిసి విద్యార్థులు ఈసారి కవాతు చేయబోతున్నారు. ఎపి, తెలంగాణ నుంచి మొత్తం 133 మంది పాల్గొంటున్నారు. ఈ టీంను కవాడీ గూడకు చెందిన బీటెక్ మూడో ఏడాది విద్యార్థి భరత్ లీడ్ చేయబోతున్నాడు. డిసెంబర్ 27 న ఢిల్లీ వచ్చిన ఈ టీం దాదాపు నెల రోజులుగా కర్తవ్య పథ్ పై కవాతు చేస్తోంది. భారత గణతంత్ర దినోత్సవాల్లో తొలిసారిగా భారతీయ సినిమా అపూర్వమైన రీతిలో జాతీయ దృష్టిని ఆకర్షించనుంది. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కోసం సినీ శకటాన్ని రూపొందించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ ఉత్సవాల్లో ప్రముఖ సినీ దర్శకుడు ఈ ప్రత్యేక సినీ శకటానికి ప్రాతినిధ్యం వహించడం విశేషం.

ఉత్తేజిత దినపత్రిక



# అటుకులని అలా తింటూ.. ఇలా బరువు తగ్గండి..







అటుకులు.. చాలా మంది ఈజీగా చేసే స్నాక్స్‌లో అటుకులు కూడా ఒకటి. వీటితో పోహా, పాలల్లో కలిపి తినడం, దోశ, ఇడ్లీ పిండిల్లో కూడా వాడతారు. వీటిని తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. ఇవన్నీ మనకు తెలియకుండానే వీటిని ఇన్నిరోజులుగా తింటున్నాం. పూర్తి వివరాలు తెలుసుకోండి. ఫైబర్ కంటెంట్, ఐరన్ కంటెంట్, పొటాషియం వంటి వివిధ రకాల పోషకాలు శరీరానికి శక్తిని. కొలెస్ట్రాల్ కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తాయి.

ఇది ఇన్సులిన్ మోతాదు మెరుగైన వినియోగాన్ని కూడా నిర్ధారిస్తుంది. అందువల్ల, ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారాన్ని అనుసరించాలనుకునేవారికి అటుకులు బెస్ట్ ఆప్షన్.

కార్బోహైడ్రేట్స్ మన బాడీకి లభించే అత్యుత్తమ పోషకాల్లో ఒకటి. ఇది మన శరీర శక్తి స్థాయిలను పెంచుతుంది. మన శరీరాన్ని సైడ్ ఎఫెక్ట్స్‌కి దూరం చేస్తుంది. అటుకుల్లో ఎక్కువగా కార్బోహైడ్రేట్ కంటెంట్ ఉంటుంది. ఇది బాడీ వెయిట్‌ని బ్యాలెన్స్ చేస్తుంది. ఇది బరువు నియంత్రణలో అలాగే ఆక్సీకరణ ఒత్తిడిని బ్యాలెన్స్ చేయడంలో హెల్ప్ చేస్తాయి. ప్రాసెస్డ్ కార్బోహైడ్రేట్స్‌కి వ్యతిరేకంగా పనిచేస్తాయి. మంచి కార్బోహైడ్రేట్స్ తీసుకోవడం వల్ల మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఉదయాన్నే అటుకులతో తయారైన పోహా, దద్ద్యోజనం వంటి ఫుడ్స్ తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. దీని వల్ల బరువు కూడా కంట్రోల్ అవుతుంది.

అటుకులు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుంది. ఈ అటుకులతో పండ్లు, కూరగాయలు, పెరుగు వంటివి కలిపి కూడా తీసుకోవచ్చు. అదే విధంగా , ఆరోగ్య నిపుణురాలు రిచా గంగాని ప్రకారం ఈ అటుకులు ఆరోగ్యానికి చాలా మంచిది. పోహా తిన్నప్పుడు త్వరగా జీర్ణమవ్వదు. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంటుంది. అదే విధంగా, దీనిని పోహాలా చేసుకుని తినొచ్చు. అందులో ఎక్కువగా కూరగాయలు, పల్లీలు, బఠానీలు వేయాలి. అప్పుడు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇక వీటితో పాటు పాలు, పెరుగు కలిపొచ్చు. వీటితో పాటు పండ్లు కలిపి తినొచ్చు. కాబట్టి తక్కువగా ఉంటుంది. దీని వల్ల బరువు తగ్గుతారు. అదే విధంగా తక్కువ పరిమాణంలోనే తీసుకోవడం మంచిది. నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# ఈ 5 ఆహారాలు న్యాచురల్ స్కిన్‌కేర్‌గా పని చేస్తాయ్..!



సన్‌స్క్రీన్.. స్కిన్‌కేర్ కచ్చితంగా ఉండాల్సింది. వేసవికాలం, వర్షాకాలం.. ఏ సీజన్ అయినా సన్‌స్క్రీన్ కచ్చితంగా అప్లై చేసుకోవాలి. ముఖానికి ట్యాన్ పట్టకూడదన్నా, ఎండ ప్రభావానికి చర్మం పాడవకూడదన్నా... సన్‌స్క్రీన్‌లోషన్ రాసుకోవడం తప్పనిసరి. మనం సన్‌స్క్రీన్‌కు చాలా ఖర్చు చేస్తూ ఉంటాం. అయితే, మనం తీసుకునే ఆహారం కూడా సన్‌స్క్రీన్‌లా రక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని ఆహారం పదార్థాలు.. విపరీతమైన వేడిని నివారించడంలో, మన చర్మాన్ని లోపల నుంచి రక్షించడానికి సహాయపడతాయి. మన చర్మాన్ని సూర్యరశ్మి నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి డైట్ తీసుకోవాలో ఈ స్టోరీలో చూద్దాం.?

మన ఆహారం సూర్యకిరణాలను నిరోధించడంలో ఎలా సహాయపడుతుంది?

మన ఆహారం సూర్యకిరణాలను నిరోధించడంలో ఎలా సహాయపడుతుంది?

మనం తీసుకునే ఆహారం.. చర్మ సంరక్షణకు కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అధిక నీటి కంటెంట్ ఉన్న ఆహారం మన డైట్‌లో చేర్చుకుంటే.. శరీరంలోని సోడియం, పొటాషియం, మాంగనీస్ కోల్పోయిన ద్రవం, పోషకాలను తిరిగి నింపడానికి తోడ్పడుతుంది. అధిక వాటర్ కంటెంట్ ఉన్న ఆహారాలు.. మన శరీరాన్ని హైడ్రేటింగ్‌గా ఉంచడానికి సహాయపడతాయి. సూర్యుని రేడియేషన్ నుంచి చర్మాన్ని రక్షించడానికి తోడ్పడతాయి, చర్మం టాన్ అవ్వకుండా కాపాడుతుంది, ఇది చర్మశుద్ధి, ఇతర అనారోగ్యాలను నివారిస్తుంది.









నిమ్మరసంలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి యూవీ కిరణాలను నుంచి చర్మాన్ని రక్షించడానికి తోడ్పడతాయి. నిమ్మరసంలోని విటమిన్ సి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇది ఫ్రీరాడికల్స్ కారణంగా.. చర్మ కణాలు దెబ్బతినకుండా రక్షిస్తుంది.

గ్రీన్ టీలో మెండుగా ఉండే రెసిపెరిట్రాల్ పదార్థం శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతుంది. రక్తం గడ్డకట్టకుండా చూస్తుంది. దీంట్లోని యాంటీఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్, అమైనో యాసిడ్స్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు హానికారక బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడతాయి. శరీరంలోని మలినాలను బయటకు పంపిస్తుంది. అలర్జీలతో పోరాడుతుంది. గ్రీన్ టీలోని యాంటీఆక్సిడెంట్లు.. సూర్యరశ్మి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి.

మజ్జిగలో పోషకాలు అధికంగా ఉంటాయి. మజ్జిగలో సోడియం, క్యాల్షియం మూలకాలు మెండుగా ఉంటాయి. వీటితోపాటు ప్రొటీన్లు, మినరల్స్ కూడా. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని, పోషకాలను అందిస్తాయి. మజ్జిగ శరీరంలో పేరుకుపోయిన మలినాలను బయటకు పంపించేస్తుంది. అలాగే జీవక్రియ రేటును పెంచి బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. దీనిలోని పోషకాలు సూర్యకిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఇది ముడతలు, ఫైన్ లైన్లను నివారిస్తుంది.

టమాటాలోని లైకోపీన్, రేడియేషన్‌లను గ్రహిస్తుంది. సన్‌బర్న్ ప్రమాదాలను నివారిస్తుంది. టమాటాలోని యాంటీఆక్సి డెంట్లు.. సూర్యకిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి.

కొబ్బరి నీళ్లను సహజమైన మాయిశ్చరైజర్ అని పిలుస్తుంటారు, ఇది చర్మానికి పోషణ అందిస్తుంది. కొబ్బరి నీళ్లు రోజూ తాగితే చర్మం మృదువుగా, తేమగా ఉంచుతాయి. కొబ్బరి నీళ్లలోని పోషకాలు.. చర్మంలోని మలినాలను తొలగించి స్కిన్ టోన్‌ని మెరుగుపరుస్తుంది, సూర్యరశ్మి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం.

# ఫ్యాషన్‌గా కనిపించాలనుకుంటే...





ఫ్యాషన్ ప్రపంచంలో ఆడవారికి ప్రత్యేక స్థానం ఉంటుంది. వారి వయసు పెరిగినా కూడా చూడడానికి ఫ్యాషన్‌గా కనిపించాలని వారు ఎంచుకునే ప్రతి వస్తువును అందంగా యూనిక్‌గా ఉండాలని చూసుకుంటుంది.

మరీ ముఖ్యంగా యాక్సెసరీస్, బట్టల ఎంపిక విషయంలో కొన్ని టిప్స్ ఫాలో అవుతారు. ఇందులో మహిళలు ధరించే నగలు, హెయిర్ స్టైల్స్, హ్యాండ్ బ్యాగ్స్, బట్టలు, వాచెస్, హై హీల్స్ ఇలా ఎన్నో.. ఎన్నెన్నో ఉంటాయి. అయితే.. ఇలాంటి వాటిలో మరికొన్ని వస్తువులు కూడా మీరు ఫ్యాషన్‌గా కనిపించేందుకు హెల్ప్ చేస్తాయి. అవేంటో చూద్దాం.

గతంలో ఒడ్డాణాలు ఉండేవి. అవే కాస్త మోడ్రన్‌గా మారి స్లిమ్ బెల్ట్, హిప్ బెల్ట్‌గా వచ్చాయి. దీని వల్ల బాడీషేప్ చక్కగా కనిపిస్తుంది. అటూ సాంప్రదాయమైన డ్రెస్సెస్, ఇటు మోడ్రన్ డ్రెస్సెస్.. ఇలా ఎలాంటి డ్రెస్సెస్‌పైనా కూడా సెట్ అయిపోతాయి. ఇవి బ్లేజర్స్‌పై కూడా బాగుంటాయి. ప్రజెంట్ మార్కెట్లో చాలా మోడల్స్, మెటల్స్ ఇలా ఎలా అయినా దొరుకతాయి. అయితే బ్లేజర్స్‌పై వాడాలంటే బ్లాక్, హాఫ్ వైట్‌లోవి ఎంచుకోవచ్చు.

చీరలు కట్టుకున్నప్పుడు ఇలా రెడీ అయితే లుక్ అదిరిపోద్ది.. సన్ గ్లాసెస్ అటూ ఫ్యాషన్‌గా కనిపిస్తూనే ఇటు కళ్ళని కూడా కాపాడుతుంది. ఇది చాలా మంది కేవలం బీచెస్‌కి వెళ్ళినప్పుడు మాత్రమే పెట్టుకుంటారు. కానీ, అలా కాదు ఎండలో బయటికి వెళ్ళినప్పుడు ఎప్పుడైనా వేసుకోవచ్చు. అయితే, అందుకోసం మీరు చక్కగా మీకు సూట్ అయ్యే సన్ గ్లాసెస్‌ని ఎంచుకోవచ్చు. వాచెస్ కూడా మీ ఫ్యాషన్ ట్రెండ్‌ని పెంచుతాయి. మనలో చాలా మంది డ్రెస్సెస్‌కి సూట్ అయ్యే వాచెస్‌ని పెట్టుకుంటారు. దీని వల్ల మరింత ఫ్యాషన్‌గా కనిపిస్తారు. అందుకోసం మీరు మంచి అందమైన, బ్రాండెడ్ వాచెస్ ఎంచుకోవచ్చు. ఈ మధ్యకాలంలో చాలా మంది స్మార్ట్ వాచెస్ వాడుతున్నారు. అలా అయినా వాడొచ్చు. లేదా బ్రాస్‌లెట్స్‌ని కూడా ట్రై చేయొచ్చు అదే విధంగా నెక్‌పీస్, బ్యాంగిల్స్, చెవిపోగులు కూడా మనల్ని ఫ్యాషన్ ఐకానిక్‌గా కనిపిస్తాయి. చెవులు, చేతులు, మెడపై ఇలా వీటిని కూడా స్టేట్‌మెంట్ పీసెస్ ఎంచుకోండి. ముక్కెర పెట్టుకోవాలనుకుంటున్నారా.. ఇలాంటివి బావుంటాయ్.. హ్యాండ్ బ్యాగ్స్.. హ్యాండ్ బ్యాగ్స్ అనేవి కూడా మీ ఫ్యాషన్‌ని ఎలివేట్ చేస్తాయి. కాబట్టి, మంచి హ్యాండ్ బ్యాగ్ ట్రై చేయండి. ఇందులో బ్రాండ్‌వి అయితే బావుంటాయి. అందుకోసం డబ్బు ఎక్కువగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదండి.. మన బడ్జెట్‌ని కూడా ఎంచుకోవచ్చు. అదే విధంగా, ఒకటే బ్యాగ్ కాకుండా ఓ రెండు మూడు కొని పెట్టుకోండి. అవి అకేషన్‌ని బట్టి స్టైల్ చేయొచ్చు. ఇందులో మీ బ్యూటీ ప్రోడక్ట్స్‌ని కూడా ఈ బ్యాగులోనే పెట్టుకు నేలా ప్లాన్ చేయండి. అందుకోసం ముందుగానే అన్ని ఆలోచించి వాటిని కొనడం మంచిది.

# పిల్లల్ని ఇలా అస్సలు కూర్చోనివ్వకండి..



మనం కూర్చునే పొజిషన్‌ని బట్టి కూడా హెల్త్ కండీషన్ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పిల్లలు ఒక్కోసారిఆకారంలో కూర్చుంటారు. అలాంటప్పుడు ఏం జరుగుతుంది.. ఏమైనా సమస్యలొస్తాయా.. రాకుండా ఏం చేయాలో తెలుసుకోండి.

పిల్లలకి ఎన్నో అలవాట్లు ఉంటాయి. వారు తెలిసి తెలియక చేసే కొన్ని పనులు పెద్దవారికి చాలా ఇష్టం. వారి బుజ్జి బుజ్జి మాటలు, బుడి బుడి నడకలు, కాస్తా తింగరి చేష్టలు ఇలాంటివన్నీ కూడా వారు ఎదుగుతున్న క్రమంలో పెద్దవారు బాగా ఎంజాయ్ చేస్తారు.

పిల్లలు కూర్చునే విధానంలో చాలా కొత్తదనం ఉంటుంది. ఒక్కోరోజు ఒక్కోలా కూర్చుంటారు. అలా కూర్చునే విధానంలో %ఔ% ఆకారంలో కూర్చుంటారు. ఇది కాస్తా వింతగా ఉన్నా మనకి ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఇలా పిల్లలు కూర్చోగలరు కానీ, పెద్దలు కూర్చోలేరు. పిల్లలు ఎంతసేపైనా ఇలా కూర్చోగలరు. కానీ, నిజానికి అస్సలు అలా కూర్చోకూడదని చెబుతున్నారు నిపుణులు. ఇలా కూర్చుంటే వెంటనే వారిని అలా కూర్చోకూడదని తెలియజేయాలి. ఏం జరుగుతుందంటే.. కొంత మంది పిల్లలు కాస్తా తక్కువ సమయం ఇలా కూర్చుంటే.. మరికొంత మంది పిల్లలు ఎక్కువసేపు ఇలా కూర్చుంటారు. అయితే, ఇదే అలవాటుగా మారితే అది వారి శరీర ఆకృతి, కదలికలపై కూడా ప్రభావం చూపుతుంది. ఇలా కూర్చున్నప్పుడు కండరాలు బలపడవు. ఎందుకంటే ఈ భాగంలోని కండరాలు ఎలాంటి పనిచేయవు. ఇలా కూర్చుంటే వెన్నెముక కండరాలు బలహీనమవుతాయి. ఈ పోశ్చర్ కారణంగా కండరాలు వంకరగా మారతాయి.

ఈ పోశ్చర్‌లో కూర్చున్న పిల్లలకి ఎముకలకి సంబంధించిన వ్యాధులు, యాంటీరియర్ క్రూసియేట్ లిగమెంట్ సమస్యలు, వెన్నునొప్పి మొదలైన సమస్యలొస్తాయి. కూర్చున్నప్పుడు బ్యాలెన్స్ తగ్గుతుంది. దీంతో ఎదుగుదల ఉండదు. నడిచేటప్పుడు పాదాల ఎదుగుదల ఉండదు. నడుము సమస్యలు, నడుము బలహీనంగా మారడం, కండరాల బలహీనమవ్వడం వంటి సమస్యలొస్తాయి. సెరిబ్రల్ పాల్సీ ఉన్న పిల్లలు, బ్రెయిన్ ఎదుగని పిల్లలు, తొడ కండరాల సమస్యలు ఉన్న పిల్లలు కూడా ఈ విధంగా కూర్చుంటారు.

పిల్లలు ఇలా కూర్చున్నప్పుడు వెంటనే వారికి చెప్పి మామూలుగా కూర్చోమని చెప్పాలి. అదే విధంగా, బయటకి వెళ్ళి ఆడుకోమనండి. ఎక్కువసేపు ఒకే పోశ్చర్‌లో కూర్చోకుండా చూడండి. అవసరమనుకుంటే డాక్టర్స్ హెల్ప్ తీసుకోండి. పిల్లలు ఈ పొజిషన్‌లో కూర్చోకుండా చూడండి. ఒక్కసారిగా ఈ అలవాటుని దూరం చేయాలంటే కష్టం. కానీ, మెల్లిమెల్లిగా ఈ అలవాటుని దూరం చేయండి.


ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం.

# పిల్లలకి మసాజ్ చేసే ఆయిల్‌ని ఇంట్లోనే తయారుచేయండిలా









సాధారణంగా పిల్లలకి స్నానం చేయించే ముందు నూనెతో మసాజ్ చేస్తారు. దీని గురించి బయట నుంచి కొనుక్కొని మసాజ్ చేస్తారు. అలా బయట నుంచి తీసుకొచ్చింది కాకుండా ఇంట్లోనే పిల్లల జుట్టు, స్కిన్ పెద్దలతో పోలిస్తే డిఫరెంట్‌గా ఉంటాయి. వారు వాడే ప్రోడక్ట్స్‌లో ఏదైనా కెమికల్స్ ఉంటే అది స్కిన్, హెయిర్‌పై నెగెటీవ్ ఎఫెక్ట్స్‌ని చూపిస్తాయి. పిల్లలకి బాత్ ఆయిల్స్ ప్రోడక్ట్స్ తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నేడు మార్కెట్లో చాలా ప్రోడక్ట్స్ అందుబాబులో ఉంటున్నాయి. అవన్నీ కూడా ఎంత వరకూ సురక్షితమో తెలుసుకోవాలి. అందుకే, ఎలాంటి కెమికల్స్ లేకుండా ఇంట్లోనే తయారు చేయాలి.

బేబి హెయిర్ ఆయిల్‌ని తయారు చేసేందుకు ముందుగా ఆముదం తీసుకోండి. అదే విధంగా, స్వచ్ఛమైన ఆలివ్ ఆయిల్ ఓ కప్పు తీసుకోండి. అందులో మీకు కావాలంటే ఓ చుక్క లావెండర్ ఆయిల్ కలపండి. వీటన్నింటిని బాగా కలపండి. ఇలా తయారైన ఆయిల్‌ని బేబి స్కిన్, హెయిర్‌కి కూడా అప్లై చేయొచ్చు. ఇవి గుర్తుపెట్టుకోండి.. ఈ నూనెని తయారు చేయడానికి మీరు కొబ్బరి నూనెతో పాటు ఆలివ్ ఆయిల్‌ని వాడినప్పుడు అవి స్వచ్ఛమైనవే తీసుకోవాలి. ఇందుకోసం కొబ్బరినూనెని ఇంట్లోనే తయారు చేయొచ్చు. ఇవి స్వచ్ఛంగా లేకపోతే చాలా చర్మ సమస్యలు వస్తాయి.

డబుల్ బాయిల్.. బేబి ఆయిల్ అప్లై చేసేటప్పుడు డబుల్ బాయిల్డ్ మెథడ్‌లో ఆయిల్‌ని వేడి చేయండి. చాలా మంది ఓ గిన్నెలో నేరుగా వేడి చేస్తారు. కానీ, అస్సలు అలా చేయొద్దు. డబుల్ బాయిల్ మెథడ్‌లో నూనె వేసి వేడి చేసి దాంతో మసాజ్ చేయండి. ఇలా తయారుచేసిన నూనెని ఓ గాజు సీసాలో ఉంచండి.

ప్లాస్టిక్ బాటిల్‌లో పెట్టకపోవడమే మంచిది. అలాగే ఆయిల్‌ని ఎండలో పెట్టండి. పెద్దవారు ఏదైనా బ్యూటీ ప్రోడక్ట్ వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేస్తాం. కొంచెం తీసుకుని చేతికి రాస్తారు. అలానే ఇప్పుడు రాయండి. ఏం ఇబ్బంది లేకపోతే అప్పుడు మాత్రమే వాడండి. వాడే ముందు కూడా ఓ సారి వారి చేతిపై కాస్తా రాసి చూడండి. ఎలాంటి సమస్య రాకపోతే అప్పుడు జుట్టుకి, చర్మంపై మసాజ్ చేసి స్నానం చేయించండి. అయితే ఎక్కువ రోజులు నూనెని వాడొద్దు. ఎప్పటికప్పుడు తాజాగా తయారు చేసిన నూనెని మాత్రమే వాడండి. అయితే, ఇవన్నీ కూడా స్వచ్ఛమైనవి వాడితే మరీ మంచిది.

# అబార్షన్ కావాలని ట్యాబ్లెట్స్ వాడుతున్నారా..



అబార్షన్ చేయించుకునేందుకు నేడు ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఇందులో ట్యాబ్లెట్స్ వేసుకోవడం కూడా ఓ పద్ధతి. దీని గురించి కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో పూర్తి వివరాలు తెలుసుకోండి. కొంతమంది పిల్లలు అప్పుడే వద్దనుకుంటారు. అలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అయినా ప్రెగ్నెంట్ అయితే.. ముందుగా డాక్టర్‌ని సంప్రదించాలి. అంతేకానీ, సొంత వైద్యం వాడొద్దు. వీటితో పాటు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలో వర్తుర్ మణిపాల్ హాస్పిటల్ గైనకాలజీ కన్సల్టెంట్ డా. హీరా మర్ది మాటల్లో తెలుసుకోండి. గర్భస్రావం అనేది గర్భంలో ఏర్పడిన పిండాన్ని తీసేయడం. ఇందుకోసం డాక్టర్స్ 10 వారాల వరకూ గర్భాన్ని తొలగించడానికి ట్యాబ్లెట్స్‌ని ఇస్తారు. దీని వల్ల గర్భస్రావం తగ్గుతుది. మొదటి ఏడు వారాల్లోపు మాత్రల తో గర్భాన్ని తొలగించడం అవుతుంది.ప్రకారం, మాత్రల్ని వాడి గర్భంలో 7 వారాల, 49 రోజుల్లోగా గర్భ స్రావం చేయొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రకారం, వైద్య గర్భ స్రావానికి 10 వారాల సమయం ఉంటుంది. కానీ, ఇది డాక్టర్స్ మాత్రమే పరీక్షించి చెబుతారు. సాధారణంగా, ఈ సందర్భంల ఎన్ని వారాలు గడిచిపోయాయో తెలుసుకోవడానికి లాస్ట్ పీరియడ్స్ గుర్తుపెట్టుకోవాలి. డాక్టర్స్ ప్రకారం, మీరు నివసిస్తున్న ప్రదేశాలు బట్టి కూడా చట్టాలు భిన్నంగా ఉంటాయి. డాక్టర్స్ సూచించిన ప్రకారం మెడిసిన్ తీసుకుంటే మంచిది. అయితే, ఈ మెడిసిన్ తీసుకునేటప్పుడు మీరు కొన్ని సమస్యల్ని ఎదుర్కునే అవకాశం ఉంది. అవి హార్మోన్ల మార్పులు, తిమ్మిర్లు, నొప్పులు ఉంటాయి. పీరియడ్స్ టైమ్‌లో బ్లీడింగ్ నార్మల్ కంటే ఎక్కువగా ఉంటుంది. ఇది మాత్రమే కాదు. రక్తస్రావం మరికొన్ని రోజులు ఎక్కువగా ఉండొచ్చు. కొందరికి విపరీతమైన వికారం, అలసట, బలహీనత కూడా ఉంటుంది. ఇది కొద్దిగా ఉంటాయి. చాలా రోజుల పాటు సమస్య ఉంటే డాక్టర్‌ని సంప్రదించడం మంచిది. మీరు అబార్షన్ గురించి వెళ్ళినప్పుడు డాక్టర్స్ అవసరమైన చర్యలు తీసుకుంటారు.

# సంక్రాంతి గ్యాంబ్లింగ్‌తో రూ.2 వేల కోట్లు లూటీ చేశారు

తాడేపల్లి: కళ్ల ముందు వాళ్లు చేస్తున్న అవినీతి కనిపిస్తున్నా.. కూటమి నేతలు తాము నిజాయితీపరులమనే భ్రమను ప్రజలకు కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్?సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. గురువారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో కొందరు జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు.

ఏపీలో ఇప్పుడు గ్రామాల్లో వాడవాడలా బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయి. పర్మిట్ రూమ్‌లు వెలిశాయి. వాటిల్లో ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక రేట్లకు అమ్ముతున్నారు. ఇసుక అమ్మకాలతో గత ప్రభుత్వంలో ప్రతీ ఏడాది రూ.750 కోట్ల ఆదాయం వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక రేట్లు డబుల్ అయ్యాయి. కానీ, ఖజానాకు మాత్రం పైసా రావడం లేదు. సిలికా,క్వార్ట్జ్ (మైనింగ్).. ఇలా ఏది కూడా అనుమతుల్లేకుండా మాఫియాలు నడుస్తున్నాయి. అమరావతిలో నిర్మాణాల పేరుతో జరిగేది ఏంటి నిర్మాణాలకు ఎంత ఖర్చు చేస్తున్నారు ఇదంతా కళ్ల ముందు కనిపించేదే కదా!. భూములు ఇవ్వడం ఒక స్కామ్ అయితే.. నిర్మాణ ఖర్చులు ఇవ్వడం ఇంకా పెద్ద స్కామ్" అని జర్నలిస్టులను ఉద్దేశించి వైఎస్ జగన్ అన్నారు. సంక్రాంతి పండుగకు కూటమి ఎమ్మెల్యేలు దగ్గరుండి జూదాలను నడిపించారు. దాదాపు ప్రతీ నియోజకవర్గంలో ఇది జరిగింది. ఈ తతంగంతో సుమారు రూ.2 వేల కోట్ల



రొటేషన్ జరిగింది. ఇందులో చంద్రబాబు, నేతలు, పోలీసులు కూడా వాటాలేసుకున్నారు. జూదం అనేది చట్టబద్ధమా. ప్రభుత్వమే దగ్గరుండి ఇలాంటి వాటిని ప్రొత్సహించడమేంటి?. ఇది ప్రజలను తప్పుడు మార్గంలో దోచుకోవడం కిందకు రాదా.. ఇది అవినీతి కిందకే వస్తుంది కదా.. లూటీ కదా!.. అని అన్నారాయన.

ప్రతిపక్ష హోదా అంశంపై వేసిన ప్రశ్నకు బదులిస్తూ.. ఈ ప్రశ్నకు గతంలో చాలాసార్లు సమాధానం ఇచ్చామని జగన్ గుర్తు చేశారు. రాష్ట్రంలో తాము తప్ప మరో ప్రతిపక్ష పార్టీ లేదనే విషయాన్ని మీడియా గుర్తించాలని.. సభలో మైక్ ఇచ్చే పరిస్థితులు లేనందునే ప్రధాన ప్రతిపక్ష హోదా కోసం పోరాటం చేయాల్సి వస్తోందని వైఎస్ జగన్ అన్నారు.



## 'చిన్నారులకు సోషల్ మీడియా బ్యాన్'..



దావోస్: ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై అక్కడి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిషేధం విధించింది. ఇలాంటి సంస్కరణలు ఆంధ్రప్రదేశ్ లోనూ అమలు చేసేందుకు పరిశీలిస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ బృందం దావోస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. దావోస్‌లో బ్లూమ్‌బర్గ్‌తో లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. "ఒక నిర్దిష్ట వయస్సు కంటే తక్కువ ఉన్న యువకులు అలాంటి ప్లాట్‌ఫామ్‌లలో ఉండకూడదు. ఎందుకంటే వారు బహిర్గతం చేసే కంటెంట్‌ను పూర్తిగా అర్థం చేసుకోలేరు. అందువల్ల, బలమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరం కావచ్చు. ఆ దిశగా మేం ఆలోచిస్తున్నాం" అని లోకేశ్ వెల్లడించారు. దావోస్ పర్యటనలోనే ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నారా లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టారు. "రెండు రాష్ట్రాల్లోని విద్యా సంస్కరణలు, ఐటీ అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చలు జరిపాం. పరస్పర సహాయ సహకారాలతో దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు అత్యంత వేగంగా వృద్ధి చెందుతాయని విశ్వసిస్తున్నా. వేర్వేరు రాష్ట్రాలుగా పెట్టుబడుల కోసం పోటీ పడినా.. కలిసి కట్టుగా దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం" అని లోకేశ్ తెలిపారు.

## ఈడీ వద్ద విజయసాయిరెడ్డి ఏం చెప్పారోనని జగన్ భయపడుతున్నారు



అమరావతి: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి.. ఈడీ వద్దకు వెళ్లి ఏం చెప్పారో అన్న భయంతో జగన్ ఉన్నారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శిం చారు. మద్యం కుంభకోణంలో ఈడీ వద్ద విజయసాయి తన పేరు ఎక్కడ చెప్పారో అనే భయంతో ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతత కోల్పోయిన జగన్.. తన బాధను ప్రజల బాధగా చిత్రీకరిస్తూ.. ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. క్రెడిబిలిటీ లేని వ్యక్తి క్రెడిట్ చోరీ అనటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తన బురదను ఎదుటివారిపై వేసే ప్రయత్నాలు జగన్ ఇంకా మానట్లేదని దుయ్యబట్టారు. పాస్ పుస్తకాలపై రూ.700 కోట్లు ఖర్చు పెట్టి తన బొమ్మలు వేసుకునే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు. ప్రజల ఆస్తుల మీద తన బొమ్మలు వేసుకునే అధికారం జగన్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా దోపిడీకి తెరలేపింది జగన్ అని ధ్వజమెత్తారు. రీ సర్వేకి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు తేడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సొంత బాబాయిని చంపిన వారిని తన పార్టీలో పెట్టుకున్న వ్యక్తి జగన్ కాదా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ది తప్ప.. ప్రజా సంక్షేమం జగన్‌కు పట్టదని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ ఘర్షణ జరిగినా దానికి రాజకీయ రంగు పులుము తున్నారు.. కులాలు, మతాల మధ్య కుంపట్లు పెడుతున్నారని మంత్రి పయ్యావుల విమర్శించారు.

## దావోస్ పర్యటనపై దుష్ప్రచారం తగదు




తిరుపతి: ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దావోస్ పర్యటనపై వైకాపా శ్రేణులు దుష్ప్రచారం చేయడం దారుణమని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియం, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, బయోటెక్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, రాష్ట్రాభివృద్ధి చేయడమే చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. గుడివాడ అమర్నాథ్ ఐటీ మంత్రిగా రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, విభజిత ఆంధ్రప్రదేశ్?లో ఐటీ పరిశ్రమలను తీసుకొచ్చి అభివృద్ధికి బీజం వేశారని కొనియాడారు. వైఎస్ జగన్ పాలనలో హత్యా రాజకీయాలు, విధ్వంసాలు, అరెస్టులు, బెదిరింపులు, దోపిడీలకు మాత్రమే జరిగాయని విమర్శించారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం 5. 13 లక్షల ఉద్యోగాలు కల్పించిందని రవినాయుడు గుర్తు చేశారు.

## పర్యటన ముగించుకుని స్వదేశానికి బయల్దేరిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు స్విట్జర్లాండ్?లోని దావోస్‌లో తన నాలుగు రోజుల పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి బయల్దేరారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న ఆయన, శుక్రవారం ఉదయం 8:25 గంటలకు హైదరాబాద్?లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా అమరావతికి పయనమై, ఉదయం 11:30 గంటల నుంచి సచివాలయంలో అధికారిక విధుల్లో పాల్గొననున్నారు.

ఈ పర్యటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత ఫలవంతంగా సాగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. కేవలం మూడు రోజుల సమావేశాల ద్వారానే గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , వ్యవసాయం, టూరిజం వంటి కీలక రంగాల్లో సుమారు రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాకారమయ్యాయని ఆయన వివరించారు. ఈ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ప్రగతిని, అందుబాటులో ఉన్న వనరులను ప్రపంచ వేదికపై సమర్థంగా వివరించగలిగామని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రపంచ దిగ్గజ సంస్థలు ఇప్పుడు భారత్ వైపు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, దేశంలోని యువశక్తి, సమర్థ నాయకత్వం, సానుకూల పాలసీలే ఇందుకు కారణమని ఆయన విశ్లేషించారు. తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మొత్తం 36కు పైగా



కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్సెలర్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, ఐబీఎం సీఈఓ అర్వింద్ కృష్ణ వంటి 16 మందికి పైగా దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇజ్రాయెల్, యూఏఈ, స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులతోనూ భేటీ అయ్యారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన 9కి పైగా సెషన్లలో పాల్గొని, ప్రపంచ పారిశ్రామిక రంగంలోని తాజా పోకడలను, పారిశ్రామికవేత్తల ఆలోచనలను తెలుసుకున్నారు. ఈ సదస్సు 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికి మరింత చేరువ చేసేందుకు, రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలను అంచనా వేసేందుకు ఎంతగానో దోహదపడిందని ఆయన పేర్కొన్నారు.

పర్యటనలో భాగంగా యూరప్‌లోని తెలుగు ప్రజలతోనూ చంద్రబాబు మమేకమయ్యారు. తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొని వారిలో ఆత్మవిశ్వాసం నింపారు. దావోస్ వేదికగా పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

## 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు



తిరుమల: తిరుమల శ్రీవారి సన్నిధిలో ఈనెల 25న రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఏర్పాట్ల వివరాలను ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. "రథసప్తమి రోజున ఏడు వాహనసేవలపై మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై.. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో వాహనసేవలు ముగుస్తాయి. వైకుంఠ ద్వార దర్శనాలు, బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం. అలాగే రథసప్తమి వేడుకలను కూడా వైభవంగా నిర్వహిస్తాం. రద్దీ దృష్ట్యా తిరుపతిలో 24 నుంచి 26 వరకు సర్వదర్శనం టోకెన్ల జారీ రద్దు చేశాం. మాడవీధుల్లో 3,700 మంది శ్రీవారి సేవకుల సాయంతో 14 రకాల వంటకాలతో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. 1,260 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందితో భక్తులకు భద్రతా ఏర్పాట్లు చేశాం. ఆర్టీసీ బస్సుల ద్వారా 2,300 ట్రిపులు నడిచేలా ప్రణాళికలు రూపొందించాం. వాహనసేవల ముందు 56 కళా బృందాలతో ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయి. 2.50 లక్షల మంది భక్తులు రథసప్తమి వేడుకలకు వస్తారని అంచనా" అని తెలిపారు. అంతకుముందు తిరుమలలోని నాలుగు మాడవీధుల్లో తితిదే అధికారులతో కలిసి బీఆర్ నాయుడు తనిఖీలు చేశారు. రథసప్తమి వేడుకలకు వచ్చే భక్తుల సౌకర్యాలపై తితిదే, విజిలెన్స్ అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు.

## మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్..



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి భక్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కోటప్పకొండ - కొత్తపాలెం గ్రామాల మధ్య పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన నూతన రహదారిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం కోట్పకొండ క్షేత్ర దర్శనం అనంతరం కొండ దిగువన ఉన్న శివస్థూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రోడ్డుపై నడుస్తూ నాణ్యతను పరిశీలించారు. రూ. 3.9 కోట్ల నిధులతో 8 కిలోమీటర్ల మేర ఈ నూతన రహదారిని నిర్మించారు. గత అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక శాసన సభ్యులు డాక్టర్ అరవింద్ బాబు భక్తుల సౌకర్యార్థం ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అర్జీ ఇచ్చారు.

శివరాత్రి ఉత్సవాలలోపు రోడ్డు నిర్మిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కోటప్పకొండ - కొత్తపాలెం మధ్య నిర్మించిన ఈ రోడ్డుతో శివరాత్రి ఉత్సవాలకు వచ్చే సుమారు లక్షన్నర మంది భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. కొత్తపాలెం గ్రామ పరిసరాల్లోని రైతులకు, గోనేపూడి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తొలగనున్నాయి. రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా గోనేపూడి పాఠశాల విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి తమ కోసం రహదారి సౌకర్యం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. గోనేపూడి జిల్లా పరిషత్ పాఠశాలకు క్రీడా మైదానంతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జనసేన నరసరావుపేట ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

త్రికోటేశ్వర స్వామి దర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో కొండ చుట్టూ గిరిప్రదక్షణ మార్గం నిర్మాణానికి సంబంధించి రూపొందించిన లే అవుట్?ని పరిశీలించారు. పల్నాడు రేంజ్ డీఎఫ జి. కృష్ణప్రియ అటవీ మార్గంలో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాన్ని చూపించారు. అటవీశాఖ నుంచి ఇవ్వాల్సిన అనుమతుల ప్రక్రియను వివరించారు. కోటప్పకొండ గిరిప్రదక్షణకు వచ్చే భక్తుల సంఖ్య రాను రాను పెరుగుతున్న నేపథ్యంలో త్వరితగతిన గిరిప్రదక్షణ మార్గం నిర్మాణ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు ఆదేశించారు.

అనంతరం కోటప్పకొండ ఘాట్ రోడ్డులో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనవిహారి జింకల పార్కును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. పార్కులోనికి వెళ్లి జింకలకు స్వయంగా ఆహారం అందించారు. ఈ జింకల పార్కులో మచ్చల జింకలు ఉన్నాయని, జింకల సంరక్షణకు, వాటికి ఇబ్బందులు కలగకుండా పర్యాటకుల సందర్శనకు ఏర్పాట్లు చేసినట్టు అటవీశాఖ అధికారులు ఆయనకు వివరించారు. వనవిహారి పార్కుకు అనుసంధానంగా ఉన్న అటవీ భూబాగాన్ని పార్కులో ఉన్న వివిధ రకాల పక్షి జాతుల వివరాలు తెలియజేశారు. పార్కులో ఉన్న వృక్ష జాతుల వివరాలు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను ఉప ముఖ్యమంత్రి అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకు న్నారు. పార్క్ సందర్శన నిమిత్తం ఏర్పాటు చేసిన ట్రైన్ ను పరిశీలించి, దాని నిర్వహణ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## 'నో వర్క్ నో పే' విధానంపై స్పందించిన జగన్



ప్రభుత్వం ఇచ్చే జీతంపై ఆధారపడేంత లేనోళ్లు తమ ఎమ్మెల్యేలు కాదని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేల కు 'నో వర్క్ నో పే' విధానం అమలు చేయాలన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలపై ఆయన స్పందిం చారు. జీతాల విషయంలో వర్రీ అవసరంలేద న్నారు. నో వర్క్ నో పేపై వాళ్లనే అడగాలని జగన్ వ్యాఖ్యానించారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్ జగన్ ఇప్పటివరకూ ఒకసారి మినహా ఎప్పుడూ కూడా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు. అటు వైసీపీ ఎమ్మెల్యేలు సైతం సభకు వెళ్లలేదు. దీంతో వాళ్ల జీతాలు నిలిపివేయా లనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహి ంచిన వివిధ రాష్ట్రాల శాసనసభా పతుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రస్తావించారు. చట్టసభలకు హాజరు కాని సభ్యుల జీతభత్యాల్లో కోత విధించాలని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పందించారు.

## కేతిరెడ్డిపై దాడికి స్కెచ్



అనంతపురం: తాడిపత్రిలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి అరాచకాలు పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై దాడి చేసేందుకు జేసీ, ఆయన అనుచరులు తాడిపత్రిలో పెద్ద స్కెచ్ వేశారు. తాడిపత్రిలో ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం పేక్షక పాత్ర పోషించడం గమనార్హం. తాడిపత్రి నియోజకవర్గంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి.. అధికార కూటమికి సవాల్ విసిరారు. తాడిపత్రిలో 30 ఏళ్ల జేసీ పాలనకు, ఐదేళ్ల తన పాలనపై చర్చకు రెడీ అని చెప్పుకొచ్చారు. అయితే, కేతిరెడ్డి సవాల్‌కు జేసీ ప్రభాకర్ రెడ్డి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. కానీ, కేతిరెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో జేసీ ప్రభాకర్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు దిగారు. రేపు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై దాడి చేసేందుకు టీడీపీ నేతల జనసమీకరణ చేశారు. ఇందులో భాగంగా కేతిరెడ్డి పెద్దారెడ్డిపై దాడి చేసేందుకు స్కెచ్ రచిస్తున్నట్టు తెలిసింది. జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాలతో జేసీ వర్గీయులు ప్రత్యేక లారీల్లో రాళ్లు తీసుకొచ్చి.. కేతిరెడ్డి ఇంటి వద్ద పోశారు. దాడి చేసేందుకు కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వద్ద కంకర రాళ్లు సిద్ధం చేసుకున్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర వహించారు. జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

# కేటీఆర్‌పై వేధింపులు ఆపాలి



రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా కక్ష సాధింపు చర్యలకే పరిమితమైందని బీఆరస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శిం చారు. హరీశ్‌రావును, కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ సిట్ నోటీసులు పంపడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యే అని అన్నారు. బొగ్గు కుంభకోణం మంటల నుండి తన కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్‌రెడ్డి ఆడుతున్న డ్రామా అని ఎద్దేవా చేశారు. తన ఒంటికి అంటుకున్న బొగ్గు మరకలను కేటీఆర్‌కు పంపిన నోటీసు కాగితాలతో తుడిచేసుకోవాలని చూడటం ఆయన వెర్రితనమని అన్నారు. వేల కోట్ల రూపాయల బొగ్గు స్కామ్ రాష్ట్రాన్ని కుదిపేస్తున్నది. దీనిపై ప్రజల్లో జరుగుతున్న చర్చను దారి మళ్లించడానికి, పాతబడి తుప్పు పట్టిన ఫోన్ ట్యాపింగ్ అస్త్రాన్ని రేవంత్‌రెడ్డి మళ్ళీమళ్ళీ ప్రయోగిస్తున్నారని తెలిపారు. అందుకే ఆయనకు డైవర్షన్ కింగ్ అనే బిరుదు వంద శాతం సరిపోతుంది. ఇప్పటికైనా ఈ చిల్లర రాజకీయాలు, డ్రామాలు కట్టిపెట్టి ప్రజలకు మేలు చేసే పనుల మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# నైనీ కోల్ టెండర్ల ఎఫెక్ట్.. సింగరేణి కేంద్ర బృందం


తెలంగాణలో సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నైనీ కోల్ బ్లాక్ వివాదం పై విచారణకు కేంద్ర బృందాన్ని సింగరేణికి పంపిచనున్నట్టు తాజాగా ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో కేంద్రం బృందం.. తెలంగాణలో పర్యటించనుంది. కాగా, నైనీ కోల్ బ్లాక్ విషయంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి  కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు.. ఇద్దరు సభ్యుల కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందం సింగరేణిలో పర్యటించ నుంది. ఈ వివాదానికి, టెండర్ రద్దు చేయడానికి గల కారణాలను, ఇతర అంశాలపైనా ఈ బృందం సింగరేణి అధికారులతో కలిసి విచారించనుంది. ఈ బృందంలో కేంద్ర బొగ్గు శాఖ, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, డైరెక్టర్ టెక్నికల్ మారపల్లి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు.

# జీవో 190ని పూర్తిగా అమలు చేయాలి..



రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగేలా ఇచ్చిన జీవో 190 ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని టీపీయూఎస్ ప్రభుత్వాన్ని కోరింది. టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వొద్నాల రాజశేఖర్, తెల్కలపల్లి పెంటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ హన్మంత్ రావులు గురువారం సచివాలయ ంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు గారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. జీవో 25 తో ముడిపెట్టకుండా ఆ జీవో ను ప్రత్యేకంగా అమలు చేయాలని పేర్కొన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు తాత్కాలిక ఉపశమనం కోసం ప్రభుత్వ ం చేసిన 190 జీవో ను వెంటనే అమలు పరచాలని కోరారు.

# బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణి అప్పులు పెరిగాయి



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి హయాంలో సింగరేణి బోర్డు నామమాత్రంగా ఉండేదని, వారి హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయని కేంద్ర మంత్రి కిషన్?రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.“సింగరేణి విద్యుత్ వాడుకొని జెన్‌కో, ట్రాన్స్‌కో డబ్బులు ఇవ్వలేదు. టెండర్ల నుంచి కాంట్రాక్టుల వరకూ అన్నీ కేసీఆర్ కుటుంబమే చూసేది. ఆ సంస్థ సీఎస్ఆర్ నిధులు కూడా దుర్వినియోగం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రైవేటు కంపెనీలకు పనులు కట్టబెట్టారు. సింగరేణి బోర్డు సమావేశం వివరాలు కూడా నా దృష్టికి రావు. సింగరేణిపై కేంద్రం అజమాయిషీ ఎప్పుడూ లేదు. నిధులు లేక జిల్లాలకు రూ.1500 కోట్ల డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ఇవ్వలేదు. బీఆరస్ హయాంలోనే ఆ సంస్థ అప్పులు భారీగా పెరిగాయి. గత పదేళ్లలో రూ.32వేల కోట్లకుపైగా సింగరేణి అప్పులు పెరిగాయి. సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సుమారు రూ.47వేల కోట్లు చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా సీఎండీని మరో 4 ఏళ్లు అదనంగా కొనసాగించారు. ప్రస్తుతం సింగరేణిలో ఇన్‌ఛార్జి సీఎండీతో కాలం గడుపుతున్నారు” అని కేంద్ర మంత్రి విమర్శించారు.

# తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌కు అపూర్వ స్పందన

దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2026 సమావేశాల్లో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ కు అంతర్జాతీయ స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం పలు ప్రతిష్ఠాత్మక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

బ్రిటన్‌కు చెందిన ప్రముఖ విద్యా, పబ్లిషింగ్ సంస్థ పియర్సన్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఏఐ అకాడమీకి పియర్సన్ సహకారం అందించనుంది. ఏఐ శిక్షణ, పాఠ్య ప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన నైపుణ్యాన్ని పియర్సన్ ఉపయోగించనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... యువతకు ఏఐ శిక్షణ అందించి భవిష్యత్ తరాలకు నైపుణ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఎంఓయూ కుదుర్చుకున్న బృందాన్ని ఆయన అభినందించారు.

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏఐ సిటీ నిర్మాణానికి అవసరమైన పూర్తి స్థాయి ఎకోసిస్టమ్ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని ప్రముఖ టెక్ కంపెనీలు ఉన్నాయని, ప్రతిభ, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఐటీ, పరిశ్రమలు) సంజయ్ కుమార్ మాట్లాడుతూ, పియర్స న్‌తో కలిసి ఉన్నత నైపుణ్యాల కలిగిన మానవ వనరుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.




ప్రాజెక్టు త్వరితగతిన అమలుకు అవసరమైన అనుమతులు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. జార్జ్ యూని వర్సిటీకి చెందిన ఏఐ కోల్యాబ్ సంస్థతో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఆరోగ్య రంగంలో ఏఐ ఆధారిత పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, ప్రజారోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అనువర్తిత పరిశోధనలకు ఇది దోహదపడనుంది. అలాగే దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్ తో కుదిరిన ఎంఓయూ ద్వారా స్టార్టప్ల అభివృద్ధికి అవకాశాలు అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకోసిస్టమ్లపై అవగాహన కల్పించడంతో పాటు, అంతర్జాతీయ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు.

# పేదల భూములను లాక్కుంటే ఊరుకోం



రంగారెడ్డి జిల్లా: ల్యాండ్ పూలింగ్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్ట విరుద్దంగా పేదల భూములను లాక్కుం టుందని బీఆరస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి డా.ఆరస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. భూములు ఎందుకు తీసుకుంటు న్నారంటూ నిలదీశారు. ఏం కంపెనీలు పెడతారు ఎలాంటి అభివృద్ధి చేస్తారో చెప్పకుండా పేదలను మోసం చేసి అన్యాయంగా విలువైన భూములను ఆక్రమించాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రజా ప్రయోజనాలు లేనపుడు ప్రభుత్వం పేదల భూములు సేకరిం చడం చట్టవిరుద్ధమన్నారు. షాబాద్ మండలంలోని రేగడి దొస్వాడ, మక్తగూడెం, తాళ్లపల్లి, తిమ్మారెడండిగూడెం గ్రామాల కు చెందిన ఎస్సీల అసైన్డ్ భూములు బలవంతంగా లాక్కోవ డాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈశా ఫౌండేషన్ కోసం భూములు ఇవ్వడానికి పేదల భూములే దొరికాయా అందుకోసం ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాలు కేటాయించవచ్చు కదా అని నిలదీశారు. ధనవంతులు విశ్రాంతి తీసుకోవడానికి నిర్మించే ఆశ్రమాల కోసం పేద ఎస్సీల భూములు కావాలా అంటూ నిలదీశారు. రేవంత్ రెడ్డి మేమూ భూస్వాములమేనని చెప్పుకున్నారు,మరి వాళ్ల భూములను ఈశా ఫౌండేషన్ వారికి ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈశా ఫౌండేషన్ వల్ల ఇక్కడి పేదలకు జరిగే లాభం ఏంటని అడిగారు. పేదలకు ఉద్యోగాలిస్తారా,చదువు చెప్తారా హాస్పిటల్ నిర్మిస్తారా అంటూ ధ్వజమెత్తారు.దానివల్ల పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. చేవెళ్ల సాక్షిగా మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో, పేదల అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక, లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీ కోసం గిరిజనుల భూమిని లక్కోవాలని చూశారని, ఇపుడు సద్గురు బాబా కోసం రేవంత్ బాబా ఎస్సీల భూములు లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పేదలను పుట్టినప్పటి నుండి కేసిఆర్ కిట్ ఇచ్చి,గురుకులాలు పెట్టి డాక్టర్లను తయారు చేసి, పేదలకు మూడు ఎకరాల భూమి ఇచ్చి,దళిత బంధుతో వ్యాపారస్తులుగా తయారు చేయాలని చూశారన్నారు. కానీ  రేవంత్ రెడ్డి మాత్రం పేదల భూములు లాక్కొని నిరాశ్రయులను చేసి,అడ్డా కూలీలుగా మార్చాలని చూస్తున్నారని విమర్శించారు. కంపెనీలు పెట్టుకోవడానికి హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూమి అందుబాటులో ఉన్నా,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీల భూమిని లాక్కొని వారి పొట్ట కొట్టాలని చూస్తున్నారన్నారు. కంపెనీల కోసం కేటాయించిన భూములను హిల్ట్ పాలసీ కింద తక్కువ ధరకు అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి, అధికారంలోకి వచ్చాక రేవంత్? రెడ్డి సెక్రటేరియట్ లో పెట్టే ప్రతి సంతకం, పేదలకు వ్యతిరేకంగానే చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములకు పట్టా బుక్ జారీచేసి,పేదలకు భూములపై సర్వ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే షాబాద్ మండలంలోని రేగడిదోస్వాడలో భూమి సేకరణకు ప్రయత్నం చేస్తే, లగచర్ల స్ఫూర్తిగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం, భూమి మార్కెట్ విలువకు 3 రెట్లు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతేకాకుండా భూమికి బదులు భూమే కావాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి పేదలకు న్యాయం జరిగేదాక పోరాడతామన్నారు.

# భారీ వర్షాలతో నీట మునిగిన కారు.. బీమా కంపెనీ పరిహారం చెల్లించాల్సిందే

హైదరాబాద్: ఇన్సూరెన్స్ సంస్థపై నమోదైన కేసులో రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ గురువారం కీలక తీర్పు వెలువరించింది. భారీ వర్షాల వల్ల టాటా నెక్సాన్ ఈవీ కారు బ్యాటరీ దెబ్బతిన్న ఘటనలో బీమా క్లెయిమ్ తిరస్కరించడం సేవాలోపమేనని, బ్యాటరీ రిప్లేస్‌మెంట్ ఖర్చు రూ.7.07లక్షలతో పాటు ఇతర మొత్తాలు చెల్లించాలని ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశించింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని సీబీఎస్ ఏజెన్సీస్ (పార్టనర్‌షిప్ ఫర్మ్ ఈవీ నెక్సాన్ ఎక్స్‌జెడ్ ప్లస్ డార్క్ ఎడిషన్ ఎలక్ట్రిక్ కారును 2022 ఫిబ్రవరి 10 నుంచి వాడుతోంది. ఈ కారుకు ఏప్రిల్ 2023లో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రైవేట్ కార్ స్టాండ్‌లోన్ ఓన్ డ్యామేజ్ పాలసీ తీసుకు న్నారు. ఇన్సూరెన్స్ మొత్తం రూ.13.84 లక్షలు. ఏప్రిల్ చివరి వారంలో భారీ వర్షాల వల్ల ఇంటి వద్ద పార్కింగ్‌లో ఉన్న కారు నీట మునిగి దెబ్బతినడంతో మే 4, 2023న తేజస్వీ ఆటోమొబైల్స్ అధీకృత సర్వీస్ సెంటర్‌కు తీసుకెళ్లారు. ఏబీఎస్ కంట్రోలర్ రిప్లేస్‌మెంట్‌కు రూ.20వేలు, బ్యాటరీ ప్యాక్‌లో నీరు లోపలికి వెళ్లడంతో మొత్తం బ్యాటరీ మార్చడానికి రూ.7, 07,589.75 ఖర్చవుతుందని ఎస్టిమేషన్ ఇచ్చారు. ఇన్సూరెన్స్ కంపెనీకి క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నా సర్వేయర్ సరిగా అసెస్‌మెంట్ చేయకుండా 'డ్యామేజ్‌లు యాక్సిడెంట్ కారణాలతో సరిపోలడం లేదు' అని జులై 31, 2023న క్లెయిమ్‌ను తిరస్కరించారు. ఫిర్యాది.. ఐఆర్?డీఏ గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించినా లాభం లేకపోయింది. సీబీఎస్ ఏజెన్సీస్ మేనేజింగ్ పార్టనర్ సంతోష్ దయానంద్ 2023 డిసెంబర్ 28న రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్?లో ఫిర్యాదు చేశారు. బ్యాటరీ, ఏబీఎస్, పార్కింగ్ ఛార్జీలు, హైర్ కారు ఖర్చులు, వ్యాపార నష్టం, మానసిక ఇబ్బందిని పరిగణనలోకి తీసుకుని రూ.17లక్షలకు పైగా పరిహారం ఇచ్చేలా ఆదేశించాలని కోరారు. విచారించిన కమిషన్.. బీమా కంపెనీ పాలసీ నిబంధనల్లో వరద నీటితో నష్టానికి మినహాయింపు లేదంటూ సర్వేయర్? సరిగా అసెస్‌మెంట్ చేయకుండా నేరుగా తిరస్కరించడం సేవాలోపమేనని స్పష్టంచేసింది. పార్కింగ్ ఛార్జీలు, అద్దె కారు ఖర్చులు, వ్యాపార నష్టం వంటివి డైరీ ఎంట్రీల మీద మాత్రమే ఆధారపడి ఉండటంతో ఆధారాలు సరిగా లేవని తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. బ్యాటరీ ఖర్చు రూ.7,07,589.75కి  9 శాతం వడ్డీ (కేసు ఫైల్ అయిన రోజు నుంచి తీర్పు అమలు వరకు) చెల్లించడంతో పాటు సర్వీస్? ఛార్జీలు రూ.20వేలు, మానసిక వేదనకు పరిహారంగా రూ.50వేలు, 45 రోజుల్లో చెల్లించాలని బీమా సంస్థను ఆదేశించింది.

# రైతులు లాభం వచ్చే పంటలను పండించాలి



రైతులు లాభం వచ్చే పంటలను పండించాలి ప్రపంచ వ్యాప్తంగా పండే ప్రతీ పంట పండించేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 19వ గ్రాండ్ నర్సరీ మేళాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులు లాభం వచ్చే పంటలను పండించాలని సూచించారు. పచ్చదనాన్ని మరింత విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రంలోని అన్నీ జిల్లా కేంద్రాల్లో నర్సరీ మేళాలు నిర్వహించాలన్నారు. నర్సరీలకు ప్రత్యేక ప్రోత్సాహం ఇచ్చి హైదరాబాద్‌లోనే కాకుండా పట్టణ వాసులందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రపంచ దేశాల్లో ఏ పంట పండినా ఆ పంటను మన రాష్ట్రంలో పండించేందుకు అనువైన వాతావారణం ఉందన్నారు. అకడమియా, ఆర్గానెట్ తదితర అన్ని రకాల పండ్ల చెట్లు, పూలచెట్లతో పాటు రైతులకు లాభం వచ్చే పంటలను రైతులు పండించుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇలాంటి నర్సరీలు రైతాంగానికి, పట్టణ వాసులకు ఉపయోగపడాలన్నారు. ప్రతీ ఏటా పెద్ద ఎత్తున గ్రాండ్ నర్సరీ మేళాను నిర్వహించేందుకు ప్రోత్సహించడం, అదేవిధంగా పండ్లు, పూలమొక్కలు, కూరగాయల మొక్కల నర్సరీలను ప్రోత్సాహించేందుకు హార్టీకల్చర్ డిపార్ట్‌మెంట్ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాషా వివరిస్తూ నర్సరీమేళాలో భారతదేశంలోని అన్ని పూలమొక్కలను అందుబాటులో ఉన్నాయని ఈనెల 26 వరకు మేళా ఉంటుందన్నారు. అన్ని రకాలు ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఫ్లవరింగ్, ఫ్రూట్స్, ఎక్సాటిక్ ప్లాంట్స్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మేళా ఇంచార్జీ ఖాలీద్ అహ్మద్ మాట్లాడుతూ ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటలకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు.

# రూ.2.14 కోట్లు పోగొట్టుకుని గిలగిల


హైదరాబాద్: మహిళ ప్రొఫైల్ ఫొటోతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.2.14 కోట్లు కొట్టేశారు. సైబరాబాద్ సైబర్‌క్రై మ్ పోలీసుల కథనం ప్రకారం.. టీఎన్‌జీవో కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (44)కు గతేడాది డిసెంబరులో సామాజిక మాధ్యమాల ద్వారా ఓ మహిళ పరిచయమైంది. రోజూ మాట్లాడుకునే వారు. ఈ క్రమంలో తాను స్టాక్ ట్రేడింగ్ ద్వారా బాగా లాభాలు సంపాదిస్తున్నట్లు ఆ మహిళ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు చెప్పింది. అనంతరం మాయమాటలు చెప్పి, తనతో ఓ యాప్ డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయించింది. గతేడాది డిసెంబరు 12న తొలిసారి రూ.31.5 లక్షలు పెట్టుబడి పెట్టగా.. లాభాలు వచ్చాయి. మరిన్ని పెట్టుబడులు పెడితే లాభాలు ఎక్కువగా వస్తాయని చెప్పగా.. రెండోసారి రూ.42.27 లక్షలు బదిలీ చేశాడు.

డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా, లాభంలో 30 శాతం పన్ను యూఏఈ ప్రభుత్వానికి కట్టాల్సి ఉందని.. మరింత పెట్టుబడులు పెట్టాలని సూచించారు. యాప్‌లో వర్చువల్‌గా కనిపించే లాభాలను నమ్మిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. ఆఫీసులో తోటి ఉద్యోగుల నుంచి రూ.90 లక్షలు రుణం తీసుకుని పంపాడు. కుటుంబసభ్యుల దగ్గర నగదు తీసుకోవడంతో పాటు కొన్ని ఆస్తులు అమ్మి మొత్తంగా 8 దఫాల్లో రూ.2.14 కోట్లు పంపాడు. డబ్బు విత్‌డ్రా కోసం ప్రయత్నించగా, అదనంగా రూ.68 లక్షలు కట్టాలని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాడు. సదరు మహిళ ఫొటోను అంతర్జాలంలో పోస్టు చేసి వెతకగా, ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ప్రొఫైల్ నుంచి సేకరించినట్లు తేలింది. నకిలీ ప్రొఫైల్ సృష్టించి మోసం చేసినట్లు తెలుసుకొని సైబరాబాద్? పోలీసులను ఆశ్రయించాడు.

# డెస్టినేషన్ మీటింగ్ అడ్డలా మారింది

హైదరాబాద్: తెలంగాణలో బీఆరస్, కాంగ్రెస్ కావాలని బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నా యని ఆరోపించారు రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచందర్? రావు. సింగరేణి నైనీ కోల్ బ్లాక్ టెండర్ల అవకతవకలపై విచారణ జరగాల్సిందేనని డిమాండ్? చేశారు. కాంగ్రెస్ నేతలు దావోస్ వెళ్లి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ తీరుపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించి నాలుగు నెలలు పూర్తి, అనుబంధ విభాగాల పనితీరుపై ఆయన సమీక్ష చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర కమిటీ పనితీరుపై రామచందర్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం, రామచందర్ రావు మాట్లాడుతూ.. బీజేపీ అగ్రనేతలతో రెండు ఉమ్మడి జిల్లాలకు ఒకటి చొప్పున ఐదు భారీ బహిరంగ సభలకు ప్లాన్ చేస్తున్నాం. జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ లాంటి వారి సభల కోసం బీఎల్ సంతోష్‌కి ప్రతిపాదనలు పంపాం అని అన్నారు.




ఇదే సమయంలో తెలంగాణ రాజకీయాలపై స్పందిస్తూ..'సింగరేణి నైనీ కోల్ టెండర్ల విషయంలో రాష్ట్రం కోరితే సీబీఐ విచారణకు కేంద్రం సిద్ధంగా ఉంది. సీబీఐకి ఇస్తే 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరగాలన్నది బీజేపీ డిమాండ్. దావోస్ వెళ్లిన సీఎం రేవంత్ లాస్ట్ టైం వెళ్లినప్పుడు తెచ్చిన పెట్టుబడులు ఎక్కడ పెట్టారో చూపెట్టాలి. ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలి. దావోస్ వెళ్లి చేస్తున్నారు. మంచు చూడటానికి వెళ్లారా. దావోస్ డెస్టినేషన్ మీటింగ్ అడ్డలా మారింది. పెట్టుబడులు తేవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. రెండు దావోస్ పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి. కాంగ్రెస్, బీఆరస్ వైఫల్యం చెందాయి కాబట్టి ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు' అని చెప్పుకొచ్చారు.

# మేడారంలో హెలికాప్టర్ సేవలు ప్రారంభించిన మంత్రి సీతక్క



మేడారం మహా జాతరకు విచ్చేసే భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెలికాప్టర్ రైడ్‌ను మంత్రి సీతక్క గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి.. భక్తుల కోసం రెండు హెలికాప్టర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి మేడారం వరకు హెలికాప్టర్ రైడ్ కోసం రూ.35,999, మేడారం పరిసరాల్లో విహారానికి రూ.4800 ధర నిర్ణయించారు.

# ట్రాక్‌లో పడినట్టే...



సినిమాల్లో ఒక హిట్ కొట్టడం కంటే ఆ హిట్‌ను కొనసాగిస్తూ అవకాశాలు దక్కించు కోవడమే అసలైన సవాల్. ఈ విష యాన్ని చాలా మంది హీరోహీరోయిన్ల కెరీర్ స్పష్టంగా చెబుతుంది. ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటున్న హీరోయిన్ కృతిశెట్టి గురించి టాలీవుడ్‌లో మళ్లీ చర్చ మొదలైంది.'ఉప్పెన' సినిమాతో ఒక్కసారిగా స్టార్‌డమ్ తెచ్చుకున్న కృతి... ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసినా ఆశించిన స్థాయి విజయాలు మాత్రం దక్కలేదు. మంచి నటిగా గుర్తింపు ఉన్నప్పటికీ, కమర్షియల్‌గా పెద్ద హిట్ లేక పోవడంతో ఆమె కెరీర్ కొంత స్లో అయిందనే చెప్పాలి. అయితే ఇప్పుడు ఆమెకు మరోసారి భారీ అవకాశం దక్కినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవలే 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న మెగాస్టార్ చిరంజీవి... తన తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నారు. దర్శకుడు బాబీతో చిరు మరోసారి కలిసి పనిచేయనున్నారు. ఈ సినిమా ఈ నెలలో లాంచ్ అయ్యే అవకాశముండగా, మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని సమాచారం.ఈ ప్రాజెక్ట్‌లో కృతిశెట్టికి కీలక పాత్ర ఇచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. అయితే చిరంజీవి సరసన హీరోయిన్‌గా కాదు, ఆయన కుమార్తె పాత్రలో కృతి కనిపించనుందనే సమాచారం వినిపిస్తోంది. కథ మొత్తం ఫాదర్,డాటర్ సెంటిమెంట్‌చుట్టూ తిరుగుతుందని, బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ మూవీ సాగుతుందని చెబుతున్నారు. చిరంజీవికి జోడీగా ప్రియమణిని ఎంపిక చేసినట్టు, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్‌ను తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ అంశాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సిఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే... కృతిశెట్టికి ఇది కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టే మెగా ఛాన్స్‌అవుతుందని చెప్పొచ్చు.

# లవ్ స్టోరీలో

ఇండస్ట్రీలో అదృష్టం ఎవరిని ఎప్పుడు తలుపు తడుతుందో చెప్పడం కష్టం. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో ఒక చిన్న అవకాశం కూడా వారి కెరీర్‌ను పూర్తిగా మార్చేస్తుంది. అలాంటి అదృష్టమే అందాల భామ ప్రీతి ముకుందన్ను వరించింది. తమిళనాడులోని తిరుచ్చిలో జన్మించిన ప్రీతి మోడలింగ్, యాడ్ ఫిల్మ్స్ ద్వారా కెమెరా ముందుకు వచ్చింది. 2024లో 'ఓం భీమ్ బుష్'తో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ప్రీతి, అందం, అభినయంతో మంచి మార్కులే కొట్టేసింది. అయినా ఆ సినిమా తర్వాత ఆమెకు పెద్ద స్థాయిలో గుర్తింపు రాలేదు.

అయితే తమిళంలో "ఆసాకూడా" అనే సాంగ్‌తో ప్రీతి ముకుందన్ పేరు సోషల్ మీడియాలో మారుమోగిపోయింది. ఆ తర్వాత మంచు విష్ణు హీరోగా తెరకెక్కిన కన్నప్పలో నెమలి పాత్రలో ప్రీతి కనిపించింది. ఈ సినిమాలో ఆమె గ్లామర్, ట్రెడిషనల్ లుక్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా నెమలి పాత్రలో ఆమె అందాల విందు, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీ క్యాస్ట్, విజువల్ గ్రాండియర్ మధ్య కూడా ప్రీతి తన పాత్రతో గుర్తుండిపోయేలా చేసింది. 'కన్నప్ప' తర్వాత ఆమె కెరీర్ గ్రాఫ్ ఒక్కసారిగా పైకి వెళ్లింది. 'కన్నప్ప' విజయం తర్వాత ప్రీతికి మంచి అవకాశాలు వస్తాయని అంతా భావించారు. అదే క్రమంలో ఆమెకు మరో ఆసక్తికరమైన ఛాన్స్ దక్కినట్లు ఫిల్మ్ సర్కిల్స్?లో టాక్ నడుస్తోంది.'హిట్' ఫ్రాంచైజీలతో పేరు తెచ్చుకున్న దర్శకుడు శైలేష్ కొలను ఈసారి యాక్షన్‌కు కాస్త బ్రేక్ ఇచ్చి, ఓ లవ్ స్టోరీ తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో హీరోగా రోషన్ మేక నటించబోతున్నాడు. 'ఛాంపియన్' సినిమాతో నటుడిగా మంచి ప్రశంసలు అందుకున్న రోషన్, లవ్ స్టోరీలకు పర్ఫెక్ట్ ఫేస్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. తండ్రి శ్రీకాంత్‌లా సహజమైన లవర్ బాయ్ ఇమేజ్ అతనికి కలిసొస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ లవ్ స్టోరీలో రోషన్ సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా ఫైనల్ అయినట్లు సమాచారం. వీరిద్దరి జోడీ బాగుంటుందని, కెమిస్ట్రీ కూడా బాగా వర్క్ అవుతుందని మేకర్స్ నమ్మకం. సితార ఎంటర్టైన్మెంట్స్ ఈ సినిమాను నిర్మించనుండగా, ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది.



# డియర్ ఆస్ట్రోనాట్



మనస్విని భాగ్యరాజా సమర్పణలో యువన్‌కృష్ణ ఎంటర్టైన్మెంట్స్ పతాకం పై నిజ జీవితంలో భార్యభర్తలైన వరుణ్‌సందేశ్, వితికా షేరు హీరో, హీరోయిన్లుగా కార్తీక్ భాగ్యరాజా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. ఈ చిత్ర తొలిపోస్టర్‌ను ఇటీవలే విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ, 'చిన్నప్పటి నుంచి అంతరిక్షంలోకి వెళ్లాలని, నక్షత్రాల మధ్య విహరించాలని కలలు కనే ఒక మహిళ కథే ఈ చిత్రం. ఆకాశమే హద్దుగా తాను ఆస్ట్రోనాట్ అవ్వాలనే లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, చేసిన పోరాటమే ఈ చిత్ర కథాంశం.ఇదొక ఇన్స్పిరింగ్ కథ, చాలా కొత్తగా ఉంటుంది. వరుణ్ సందేశ్, వితికా షేరు అద్భుతంగా నటిస్తున్నారు. కార్తీక్ కొడకండ్ల సంగీతం అందిస్తున్నారు. మంచి నిర్మాణ విలువలతో సరికొత్త కథ, కథనంతో ఈ సినిమాని త్వరలోనే రిలీజ్

# తొలి సినిమాగా...

సీకే ఫిల్మ్ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాత బి. చంద్రకాంత్ రెడ్డి నిర్మిస్తున్న ఫీల్ గుడ్ రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ 'మరొక్కసారి' షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ దశకు చేరుకుంది. నితిన్ లింగుట్ల రచన, దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నరేష్ అగస్త్య , సంజనా సారథి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దక్షిణాది భాషలన్నింటిలో విడుదల చేయాలనే లక్ష్యంతో సినిమాను మేకర్స్ భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. రొటీన్ ప్రేమకథల పరిధిని దాటి, విజువల్స్‌తో పాటు బలమైన ఎమోషన్స్‌ను కొత్తగా ఆవిష్కరించాలనే ప్రయత్నమే 'మరొక్కసారి' ప్రత్యేకతగా నిలు స్తోంది. ఈ సినిమాను డిఫరెంట్ లొకేషన్లలో చిత్రీకరించడమే కాకుండా, సహజసిద్ధమైన ప్రకృతి అందాలను కథలో భాగం చేశారు. ముఖ్యంగా కేరళలోని పచ్చని ప్రకృతి మధ్య కీలక సన్నివేశాలను తెరకెక్కించగా, మరింత సాహసోపేతంగా టిబెట్ సరిహద్దుకు సమీపంలోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో కూడా షూటింగ్ నిర్వహించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న సరస్సులలో ఒకటైన గురుడోంగ్మార్ సరస్సు వద్ద షూటింగ్ జరిపిన తొలి భారతీయ చిత్రంగా 'మరొక్కసారి' నిలవడం విశేషం. సముద్ర మట్టానికి సుమారు 5,430 మీటర్ల (17,800 అడుగుల) ఎత్తులో ఉన్న ఈ సరస్సు వద్ద చిత్రీకరణ జరగడం చిత్ర బృందానికి గర్వకారణంగా మారింది.

అయితే ఈ అరుదైన లొకేషన్‌లో షూటింగ్ అంటే మాటలు కాదు. తక్కువ ఆక్సిజన్ స్థాయిలు, తీవ్రమైన చలి, పరిమిత షూటింగ్ సమయం, అకస్మాత్తుగా మారిపోయే వాతావరణ పరిస్థితులు వంటి ఎన్నో సవాళ్లను యూనిట్ ఎదుర్కొంది. సాయుధ దళాల ప్రత్యేక అనుమతులు తీసుకుని, కఠినమైన భద్రతా నిబంధనల మధ్య ఈ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. లాజిస్టిక్ పరంగా కూడా టీమ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. కఠినమైన భూభాగం, పరిమిత రవాణా సౌకర్యాలు, షూటింగ్ ఎక్విప్‌మెంట్ తరలింపులో ఆలస్యాలు, స్థానిక అనుమతుల ప్రక్రియలో సంక్లిష్టతలు, విద్యుత్, కమ్యూనికేషన్ పరిమితులు ఇవన్నీ కలిసి ఈ షెడ్యూల్‌ను అత్యంత ఛాలెంజింగ్‌గా మార్చాయి.

ఈ పరిస్థితుల్లో నటీనటులు, టెక్నికల్ టీమ్ ఆరోగ్యం, భద్రత, మానసిక ఉత్సాహానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రొడక్షన్ హెడ్ అనుదీప్ పడురు కీలక పాత్ర పోషించారు. ఆయన సమన్వయంతో, కఠిన వాతావరణంలోనూ



షూటింగ్ సజావుగా పూర్తవడం చిత్రబృందం ప్రత్యేకంగా ప్రస్తావిస్తోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ పూర్తవగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్‌లో డీఐ వర్క్ జరుగుతూ, ఫైనల్ కలర్ గ్రేడింగ్, విజువల్ ఫినిషింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఈ చిత్రానికి బలమైన క్రూ పనిచేసింది. ఛాయాగ్రహణ బాధ్యతలను రోహిత్ బచు నిర్వర్తించగా, ఎడిటింగ్‌ను చోటా కె. ప్రసాద్ చూసుకున్నారు. సంగీతాన్ని భరత్ మాంచిరాజు అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను రవికుమార్ చలమటికారి, సౌండ్ డిజైన్‌ను సాయి మణిందర్ రెడ్డి, పబ్లిసిటీ డిజైన్‌ను అరుణ్ రాహుల్ విటల నిర్వహిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వెంకటేష్ వై, చీఫ్ అసోసియేట్ డైరెక్టర్‌గా శివ కుమార్ కూకటికొండ పని చేస్తున్నారు.

# యూనిక్ కాన్సెప్ట్‌తో...



పూరి జగన్నాథ్, హీరో విజయ్ సేతుపతి మోస్ట్‌ఎవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'స్లమ్ డాగ్33 టెంపుల్‌రోడ్'. షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం ఇప్పుడు పోస్ట్-ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్‌బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి మోహన్ పిక్చర్స్ జెబి నారాయణరావు కొండ్రోల్లాతో కలిసి నిర్మిస్తున్నారు. దునియా విజయ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించ నున్నారు. ఆయనకి పుట్టి నరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిత్రబృందం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథా నాయికగా నటిస్తుండగా, టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్‌లు హ్యూమరస్ పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో గ్రాండ్ పాన్-ఇండియా రిలీజ్ కానుంది.

# కొత్త డిమాండ్లు

చిన్న చిన్న పాత్రలతో సినిమాల్లో అడుగుపెట్టిన నవీన్ పోలిశెట్టి క్రమంగా తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే డైలాగ్ డెలివరీ, సహజమైన కామెడీ టైమింగ్‌తో నవీన్ తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్క్ క్రియేట్ చేసుకున్నారు. 'జాతి రత్నాలు' చిత్రంతో స్టార్‌డమ్ అందుకున్న ఆయన తాజాగా సంక్రాంతి కానుకగా విడుదలైన ' అనగనగా ఒక రాజు 'తో మరోసారి తన రేంజ్ ఏంటో ప్రూవ్ చేశారు. పెద్ద హీరోల సినిమాల హడావుడి మధ్య కూడా కంటెంట్ ఉంటే చాలు బాక్సాఫీస్‌ను షేక్ చేయవచ్చని నవీన్ నిరూపించారు. ఈ సినిమా థియేటర్లలో మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ముఖ్యంగా క్లీన్ కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఫలితంగా తొలి రోజే రూ.22 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ చిత్రం, మూడు రోజుల్లో రూ.61.1 కోట్ల గ్రాస్ రాబట్టి ట్రేడ్‌ను ఆశ్చర్యపరిచింది. ఐదు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరి సంక్రాంతి రేసులో అసలైన విజేతగా నిలిచింది. ఈ ఘనవిజయం తర్వాత నవీన్ నెక్స్ట్ సినిమా ఏంటన్న ఆసక్తి ఇండస్ట్రీలో పెరిగింది. సంక్రాంతి హిట్‌తో ఆయన మార్కెట్ ఒక్కసారిగా పెరగడంతో బడా నిర్మాతలు సైతం నవీన్‌తో సినిమా చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారని టాక్. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే హీరోగా పేరున్న నవీన్ సినిమా అంటే మినిమమ్ గ్యారెంటీ అనే నమ్మకం నిర్మాతల్లో ఏర్పడింది. అయితే ఇదే సమయంలో ఆయన తన తదుపరి సినిమాల విషయంలో కొన్ని కొత్త కండీషన్లు పెడుతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. తన దగ్గరకు వచ్చే ప్రతి నిర్మాతకు రెండు స్పష్టమైన షరతులు పెట్టి, వాటికి ఓకే అయితేనే సినిమా చేస్తానని చెప్పినట్లు సమాచారం.ఈ రెండు కండీషన్లలో మొదటిది పారితోషికానికి సంబంధించినది. తదుపరి సినిమా నుంచి రూ.15 కోట్ల రెమ్యూనరేషన్ కావాలని నవీన్ డిమాండ్ చేస్తున్నాడట. హిట్ తర్వాత పారితోషికం పెరగడం సహజమే కావడంతో ఈ షరతుపై నిర్మాతలు పెద్దగా అభ్యంతరం చెప్పడం లేదని అంటున్నారు. ఇది హీరో మార్కెట్‌ను ప్రతిబింబించే అంశమే అన్నది ట్రేడ్ వర్గాల అభిప్రాయం. కానీ అసలు చర్చకు దారి తీస్తున్నది రెండో కండీషన్. అదేంటంటో సినిమా మొత్తంపై పూర్తి కంట్రోల్ తనదేనని, నిర్మాత జోక్యం ఉండకూడదని నవీన్ కోరుతున్నాడట. నిర్మాత కేవలం ఫైనాన్సియర్‌గా మాత్రమే ఉండాలి, సినిమా ఫస్ట్ కాపీ పూర్తయ్యాకే చూపిస్తానని ఆయన చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.



Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.